ప్రజాశక్తి ఆదివారం అనుబంధం
స్నేహ
ఫిబ్రవరి 15, 2009
చందమామ
prem kumar patra presents
వినాయకుడు
written & directed by saikiran adivi
చిన్న చిత్రాలదే చిద్విలాసం..

హ్యాపీ బర్త్‌డే

(2009 ఫిబ్రవరి -15 నుంచి
2009 ఫిబ్రవరి - 21 వరకు)

డి. శ్రీరఘునందన్
3సం॥, ఫిబ్రవరి-20
విజయలక్ష్మి-అజయ్‌కుమార్
మల్లవరం-ఖమ్మం

టి. మేఘన
4సం॥, ఫిబ్రవరి-15
కల్పన-సంపత్‌కుమార్
రామంతపూర్-హైదరాబాద్

ఇ. భానుశ్రీ
3సం॥, ఫిబ్రవరి-19
మాధవి-రామారావు
గందగాలపాడు-ఖమ్మం

యెషిక (శీతల్)
3సం॥, ఫిబ్రవరి-21
సుజాత-అరుణ్‌కుమార్
జమిస్తాన్‌పూర్-హైదరాబాద్

ఎండి. ఇస్మాయిల్
7సం॥, ఫిబ్రవరి-15
షహెనాజ్-గాలబ్

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి
ప్లాట్ నెం. 21/1, అజామాబాద్ ఇండస్ట్రియల్
ఎస్టేట్, ఆర్టీసీ కళా భవన్‌దగ్గర ,
హైదరాబాద్-500 020

కథా నిలయం
శ్రీకాకుళం

మనలో మాట

సంస్కృతి.. పరిష్కృతి

పాత రోజుల్లో 'ప్రేమించు ప్రేమకై' అని ఉద్బోధించారు ఒకరు. 'ప్రేమ పంచిన ప్రేమ వచ్చును' అని పరవశించారు మరొకరు. 'ప్రేమే ప్రాణం ప్రేమే దైవం' అని సూత్రీకరించారు ఇంకొకరు. వీటి అన్నింటి మూలం ఒక్కటే : ప్రేమ ఒక అపురూపమైన భావన. ప్రేమ విశ్వ గమనానికి ప్రేరణ.

తల్లీపిల్లల మధ్య, అన్నాచెల్లెళ్ల మధ్య, ఆలూమగల మధ్య, స్నేహితుల మధ్య, మనిషికీ మనిషికీ మధ్యా, దేశదేశాల మధ్య... ఈ జాబితా అనంతం. ప్రేమ... అదో హృదయ భాష. ప్రేమ లేనిదే ప్రపంచం లేదు. కొంతమంది ప్రేయసీ ప్రియుల ప్రేమ ఒక్కదాన్నీ విడదీసి, వ్యాపారంగా మార్చేసి, దానికొక 'దినం' పెట్టేశారు. ఫిబ్రవరి 14కు ప్రేమికుల రోజు అని నామకరణం చేసి, ప్రపంచం మీదికి వదిలేశారు. ఖరీదైన గిఫ్టులూ, హుషారైన కాన్సెప్టులూ రంగంలోకి దింపారు. వేలకోట్ల వ్యాపారం సాగిపోయే సందర్భంగా మలిచేశారు. వ్యాపారం ఎంటరయ్యాక - ప్రేమ కూడా 'సరుకు' అయిపోయింది! విస్తరిస్తున్న ఈ వినియోగ సంస్కృతిని అడ్డుకోవడం అవసరమే. అయితే, అది వ్యక్తిస్వేచ్ఛనూ, వివేచననూ అవమానించకూడదు.

కానీ, 'సంస్కృతీ పరిరక్షకులు'గా ప్రకటించుకుంటున్న శివ, రామసేనలు పనిగట్టుకొని ఆ పనే చేస్తున్నాయి. నిన్నటికి నిన్న ముంబాయి, బెంగుళూరు, మంగుళూరు వంటి నగరాల్లో యవతీయువకులు కలిసి కనిపిస్తే చాలు, ఆ సేనల కార్యకర్తలు అనుమానపు చూపులు చూశారు. వెంటాడి వేధించారు. తాళిబొట్లు చేత పట్టుకొని పెళ్లి జరిపిస్తామని బెదిరించారు. పార్కుల్లో కబుర్లు చెప్పకుంటున్నవాళ్లను వెంటబడి తరిమారు. దీనికి కొద్ది రోజుల ముందు బెంగుళూరులో ఒక ఎమ్మెల్యే కుమార్తె బస్సులో తన ముస్లిం మిత్రుడితో మాట్లాడిందని అత్యంత దారుణంగా వ్యవహరించారు. ఇద్దరినీ బస్సునించి దించి ఎటో లాక్కెళ్లిపోయారు. అబ్బాయిని కొట్టారు. అమ్మాయిని తిట్టి, వేధించారు.

ఏ సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడ్డం కోసం ఈ అరాచకాలూ అకృత్యాలూ? ఏ ధర్మసంస్థాపనకోసం ఈ అధర్మ సంఘటనలూ సన్నివేశాలూ? విష సంస్కృతిని ప్రతిఘటించాల్సిందే, కాని ఏది విష సంస్కృతి. ఎవరికి తోచిన నిర్వచనం వారు ఇచ్చేయడమేనా? వ్యక్తులపై దాడులూ దౌర్జన్యాలు జరపడమేనా?

విధ్వంసంవల్ల ఏ మంచి సంస్కృతీ నిలబడదు.
ఎందుకంటే- విధ్వంసం ఒక విష, హీన సంస్కృతి!
దానిని వివేచనతో తిప్పి కొట్టడం ఒక్కటే పరిష్కృతి!!

❋

ఈ సంచికలో....

టపా	...	2
విజ్ఞాన వీచిక	...	3
చూద్దామా	...	4
ఆరోగ్యం	...	7
కథ	...	8
మంచి పుస్తకం	...	10
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
రుచి	...	20
సినిమా కబుర్లు	...	21
క్రైమ్ కథ	...	23
కొత్త పుస్తకాలు	...	24

ఇంకా...



సమ్‌థింగ్ స్పెషల్...6
దంతబలుడు

కవిత్వమ్ ...18
రెక్కలు తెగిన గువ్వ

తెల్సా ... 19
విరుద్ధ పుష్పాలు

పేజీ ... 22
షంషాద్ బేగంకు 'పద్మ' అవార్డ్



ఆకుట్టుకున్న రాగ మాంత్రికుడు

ఇటీవల మన భారతీయ సినిమా పాటలు, సంగీతంలో తనదైన సరికొత్త శైలిలో అద్భుతాలు సృష్టించాయి. ఎవరూ ఊహించని విధంగా సంచలనాత్మకంగా తొలి గోల్డెన్‌గ్లోబ్ అవార్డులు స్లమ్ డాగ్ మిలియనీర్ పొందడం, ఆస్కార్‌కు మూడు నామినేషన్లు రావటం సినిమా చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించవలసిన చారిత్రాత్మక అంశం. ఈ వారం రాగమాంత్రికుడు, జగన్మోహనుడు ఎ.ఆర్.రెహమాన్ అట్టమీది కథ చదివి ఎంతో పరవశించాము. రెహమాన్ పాటలు, సంగీతం కేవలం ధ్వనులు మాత్రమే కాదు.అవి మానసిక రోగాలను నివారించే ఔషధాలని చెప్పక తప్పదు. తెలుగు భాషాజ్యోతి గురజాడ అసమ్మతి ఓ మంచి పుస్తకంలోని అంశాలు మమ్ములను ఎంతో స్పందింప చేశాయి. ఇప్పటికీ చిన్న పిల్లల పుస్తకాలలో కఠినపదాలు ఉంటున్నాయన్న నగ్న సత్యాన్ని మేము కూడా అనుభవపూర్వకంగా తెలుసుకున్నాం.

జె. సుధాకర్ పట్నాయక్,
కాకినాడ.

రెహమాన్ కృషి అభినందనీయం

బాల్యంలో తీవ్రపేదరికాన్ని అనుభవించినా, కుటుంబ ఆర్థిక పరిస్థితుల వల్ల చదువును వదిలేసినా సంగీతం పట్ల తనకున్న ఆసక్తితో కృషి చేశాడు. విశ్వవిఖ్యాత సంగీత కళాకారుడిగా ప్రత్యేక గుర్తింపు పొందిన ఎఆర్ రెహమాన్ గురించిన ఎన్నో విషయాలను 1-2-09 నాటి స్నేహలో కవర్ స్టోరీ ద్వారా తెలుసుకున్నాం. ఎందరో సంగీతకర్తల వ్యంగ్య మాటలను పట్టించుకోక తనదైన శైలిలో అందరిమనసులను చూరగొన్న రెహమాన్ కృషి అభినందనీయం. అలాగే గురజాడ అప్పారావు గారి అసమ్మతి పత్రం రచనకు దారితీసిన పరిస్థితులను గురించిన విశేషాలు ఆకట్టుకున్నాయి. మధ్య ప్రదేశ్‌లోని ఖజురహో దేవాలయం గురించిన విశేషాలను చూద్దామా శీర్షిక ద్వారా తెలుసుకున్నాం. గొప్ప పర్యాటక స్థలం ఖజురహో. సైనస్ తలనొప్పిని గురించిన అమూల్యమైన విషయాలను ఆరోగ్యం ద్వారా మేము తెలుసుకోడానికి వీలయ్యింది. నోరూరించే ఎండుచేపల పులుసు తయారీ విధానాన్ని రుచి శీర్షికలో అందించినందుకు ధన్యవాదాలు.

గొల్లమందల సురేష్
కుమార్, సీతారాంపురం, ఖమ్మం.

చక్కటి ఆరోగ్య సలహాలు

ఓ మంచి పుస్తకంలో గురజాడ అసమ్మతి చాలా బాగుంది. ఆరోగ్యంలో తలనొప్పి గురించి, అది ఎన్ని రకాలుగా వస్తుందో, దానికి గల కారణాలు, ఏ లక్షణాలను బట్టి మనం దానిని గుర్తించవచ్చో డాక్టర్ రవి కిషోర్ గారు చాలా విపులంగా తెలియజేశారు. ఆరోగ్యం శీర్షికలో ఇదే విధంగా ఎప్పుడూ సలహాలు ఇవ్వాలని కోరుకుంటున్నాము. సమ్‌థింగ్ స్పెషల్‌లో టెర్రకోట బొమ్మల గురించి, వాటి తయారీ దార్ల ఒడిదుడుకుల గురించి తెలుసుకున్నాం. అట్టమీది కథగా వచ్చిన రాగమాంత్రికుడు జగన్మోహనుడు అని ఎ.ఆర్ రెహమాన్ గురించి మాకు తెలిని ఎన్నో కబుర్లు ఈ శీర్షిక చదివి తెలుసుకున్నాము. బాల్యంలో అతను పడ్డ కష్టాలు, పేరు మార్చుకోవడాని గల కారణాలు, సినిమాల్లో ఎలా పేరు సంపాదించుకున్నాడో ఇలా ఒకటేమిటి... అతను అందుకున్న కీర్తి ప్రతిష్ఠలు ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలనిపించేలా ఉన్నాయి.

వనజ, తాడిపత్రి.

సమాజం కోసం సైన్స్

విజ్ఞాన వీచికలో చాపలా చుట్టుకునే స్క్రీన్ల గురించి చదివి ఎంతో ఆశ్చర్యపోయాము. నేడు టెక్నాలజీ ఎంతో అభివృద్ధి చెందుతోంది. మనిషికి సాధ్యంకానిదంటూ ఏమీ లేదని, తను తలచుకుంటే ఏదైనా సాధించగలడనీ ఇలాంటి విషయాలు చదివినప్పుడు స్పష్టమౌతుంది. కానీ అదే సమయంలో కొందరు తాము సంపాదించిన విజ్ఞానాన్నంతా అభివృద్ధికి కాకుండా దుర్వినియోగపరుస్తున్నారు. అలా కాకుండా మంచి చెడుల తేడాలను గుర్తించి తన అవసరాలకు మాత్రమే వాడుకుంటే సమాజాన్ని, విజ్ఞానాన్ని కాపాడిన వారౌతారు.

రాజేంద్ర, విశాఖ.

మరిన్ని వంటకాలు

రుచిలో వచ్చే వంటకాలన్నీ మేం ఇంట్లో తయారు చేస్తున్నాం. చాలా బావుంటున్నాయి. ఇలాగే ఇంకా మంచి మంచి వంటకాలను మాకు పరిచయం చేస్తారని ఆశిస్తున్నాం. జోక్స్ చాలా బాగున్నాయి. మై బెస్ట్ ఫ్రెండ్ కథ బాగుంది. ఈ వారం స్వాముల సేవకు వేళాయె... అంటూ ఒక చిన్న కథను అందించారు. ఈ కథ చదువుతున్నప్పుడు నేడు మన సమాజంలో స్వాములు ఎలా తయారౌతున్నారో అర్థమౌతోంది. ఇంకా మనలో మాటగా వచ్చిన 'ముగ్గురు వంటగాళ్ల కత' చాలా బాగుంది. మూడవ కవర్ పేజీలో 'ఎంత పెద్ద పజిలో' చూసి ఆశ్చర్యపోయాం. మామూలుగా



మనం పుస్తకాల్లో చిన్న చిన్న పజిళ్లని పూర్తిచేస్తాం. కానీ ఇంత పెద్ద పజిల్ పూరించాలంటే ఎంత సమయం పడుతుందో అనే ఆలోచనే తమాషాగా ఉంది.

జరీనా, ఆలేరు.

వారెవరో తెలిసింది

01-2-09 నాటి స్నేహ లో అట్టమీది కథగా వచ్చిన 'రాగమాంత్రికుడు జగన్మోహనుడు' ... రెహమాన్ అభిమానులకు ఎంతో ఆనందం కలుగజేసింది. వేళ్లాడే పెద్ద పూలబుట్ట... అంశంతో పాటు పెద్ద పజిల్ ఉదంతం ఆశ్చర్యచకితుల్ని చేసేవిధంగా ఉన్నాయి. చూద్దామా...లో ఖజురాహో విశేషాలు ఆహ్లాదపరిచాయి. రాముగారి కార్టూన్లలో ఇంకా బిగి, పస ఉండాల్సిన అవసరం ఉంది. 'సమ్‌థింగ్ స్పెషల్'గా.... టెర్రకోట మట్టి బొమ్మలకు జీవం పోస్తున్న పలమనేరు శిల్పులకు అభినందనలు. విజ్ఞాన వీచికలో చాపలా చుట్టుకునే స్క్రీన్లు రాబోతున్నాయని తెలుసుకుని ఔరా ఏం సైన్స్!! హ్యాట్సాఫ్ టు సైన్స్ అనుకున్నాం. మనలో మాటగా ఆ ముగ్గురు వంటగాళ్లెవరో మాకు తెలిసిపోయిందోచ్!...

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

మీ రచనలను, ఉత్తరాలను పంపవలసిన చిరునామా...
మోటూరు హనుమంతరావు భవన్, 21/1,
అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా,
హైదరాబాద్.

చైనా మొబైల్ ఫోన్

సమస్యా సైన్సే, పరిష్కారమూ సైన్సే!

- డా॥ కాకర్లమూడి విజయ్

అరచేతి మందాన ప్రకాశవంతమైన డిస్ప్లే. ఫర్లాంగు దూరం వినిపించే శబ్దం. మెరుగైన కెమెరా. చేతివేళ్ల స్పర్శకు స్పందించే మెనూ. ఇక మ్యూజిక్కు, వీడియోలు... ఇన్ని ఫీచర్లు కలిగిన మొబైల్‌ఫోన్ ధర ఏ పాతికవేల పైచిలుకో అనుకుంటే... ఆ ధరవీ ఉన్నాయి. అంతకు పదింతలు తక్కువ ఖరీదువీ వున్నాయి.

అత్యాధునిక సౌకర్యాలు ఉన్నా చవకగా లభించే ఫోన్లకు మనం పెట్టుకున్న పేరు 'చైనా ఫోన్లు'. ప్రస్తుతం పెద్ద బ్రాండు (అంటే ఖరీదైన) ఫోన్లతో పోటీ పడుతున్న ఫోన్లు ఇవి. అందువల్ల బ్రాండెడ్ ఫోన్లకంటే వీటి అమ్మకాలు ఎక్కువే అని తేలింది. కాకపోతే వీటికి బిల్లులు, వారంటీలు, గ్యారంటీలు వుండవు. గ్యారంటీలు లేవు కాబట్టి ఇవి త్వరగా పాడైపోతాయన్న భయాలు నిజాలు కావు. పాడైపోవడమే అయితే అది అతి ఖరీదైన ఐఫోనైనా ఒకటే, మరే ఫోనైనా ఒకటే. ప్రపంచంలో అత్యధికంగా అమ్ముడుపోతున్న నోకియా ఫోన్ల సర్వీస్ సెంటర్లను చూస్తే ఆ ఫోన్ల సమస్య తీవ్రత అర్థమౌతుంది. కానీ చైనా ఫోన్లకు రిపేర్లు చేయడం అరుదు. అందువల్ల వాటిని వాడినంతకాలం (అంటే అవి పనిచేసినంత కాలం) వాడి ఆ తరువాత పడేయడమే. ఈ కారణంగా చైనా ఫోన్లు కారుచవక! అంత చవకలోనూ అత్యాధునిక ఫీచర్లు కెమెరా, బ్లూటూత్, టచ్‌స్క్రీన్, స్టీరియో సౌండ్, వీడియో, ఎంపిఎస్ ప్లేయర్ వంటివన్నీ కలిగి వుండటం విశేషం.

చైనా ఫోన్లు మూడు రకాలుగా వుంటాయి.

1. గృహ పరిశ్రమ- ఇక్కడ రీసైకిల్ కోసం వచ్చిన భాగాలతో, స్వంతంగా ఫోన్ భాగాలను 'అమర్చి' 'డై'ల ద్వారా ఫోన్ల కవర్లను తయారు చేస్తుంటారు. ఈ ఫోన్లలో ఐఎంఇఐ నెంబరు వుండదు. ఏదో ఒక కల్పిత నెంబరును స్టిక్కర్‌గా అతికిస్తారు.

2. చిన్న తరహా పరిశ్రమలు- ఇక్కడ తైవాన్ నుండి టోకుగా విడి భాగాలను కొని అసెంబుల్ చేస్తారు. వీటిని చైనాలో అమ్మడానికే వినియోగిస్తారు. మన దేశానికైతే ఎగుమతి చేయరు. వీటికీ ఐఎంఇఐ నెంబర్లు వుండవు.

3. భారీ పరిశ్రమలు- ఇక్కడ ప్రపంచ ప్రసిద్ధమైన నోకియా, ఎల్‌జి, శామ్‌సంగ్ వంటి కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని ఫోన్లు తయారౌతుంటాయి. బాటరీల వంటి విడి భాగాల నుండి అన్నీ అసలు కంపెనీల నాణ్యతా ప్రమాణాల మేరకే తయారౌతాయి. ఇటువంటివి ప్రపంచవ్యాప్తంగా పంపిణీ చేయబడతాయి.

ఇక ఐఎంఇఐ నెంబర్ల సమస్య. ఏ రకమైన చైనా ఫోన్ పరిశ్రమ అయినా ఐఎంఇఐ నెంబరు సీక్వెన్సు పొందడానికి నిర్ణీత రుసుము చెల్లించాల్సి వుంటుంది. అందుకు కొంతమంది ఇష్టపడరు- ఫలితంగా మనదేశానికి చేరిన ఫోన్లకు డూప్లికేటు నెంబర్లు లేదా కల్పిత నెంబర్లు వస్తాయి.

అయితే ఈ డూప్లికేట్ నెంబర్లు కేవలం చైనా ఫోన్లకే పరిమితం కాదు. నోకియా వంటి పెద్ద కంపెనీ ఫోన్లకూ ఆ సమస్య వుంది! 'గ్రే' మార్కెట్లో అమ్మబడే బ్రాండెడ్ ఫోన్లు షోరూంలలో కంటే చాలా తక్కువ ధరకు లభిస్తాయి. అటువంటి ఫోన్లు వాస్తవంగా నాణ్యమైన ఫోన్లే. కాకపోతే కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్న దళారులు చవకగా కొని అమ్ముతారు. ఆ నాణ్యమైన బ్రాండెడ్ ఫోన్లకూ ఐఎంఇఐ నెంబరు వుండదు మరి! వున్నా డూప్లికేటుదే!

కాబట్టి చైనా ఫోన్లన్నింటినీ ఒకేగాటన కట్టకూడదు. మన దిగుతమతిదార్లు నాణ్యతకన్నా 'లాభం' చూస్తారు కాబట్టి చౌకబారు ఫోన్లే మనకు వస్తున్నాయి. లాభసాటి ధరతోపాటు వాటిలో అనేక సౌకర్యాలున్నాయి కాబట్టి అవి ఆకర్షణీయంగా వున్నాయి. అయితే ఈ ఐఎంఇఐ గొడవ సామాన్య వాడకం దార్లకంటే ముందే సంఘ విద్రోహులు కనిపెట్టారు. సరైన ఐఎంఇఐ నెంబరు లేకపోవడం వల్ల ఫోను ఎవరిది, ఎక్కడుంది? వంటి వివరాలు ఎవరూ కనిపెట్టలేరని వారికి అర్థమైంది. దాన్ని స్వలాభానికి, విధ్వంసానికీ వాడుకుంటున్నారు.

ఆ సమస్య తీవ్రమయ్యాక ప్రభుత్వాలు మేలుకున్నాయి, చైనా ఫోన్లను నిషేధిస్తామన్నాయి. మళ్లీ ఆ నిర్ణయాల్లో సవరణలూ, చేర్పులూ, కూర్పులూ, వాయిదాలూ మామూలే.

ఈ మొత్తం గొడవవల్ల కొద్దిమంది సంఘవ్యతిరేక శక్తులు చైనా ఫోన్లను వాడడమేమో (అవి మరో కొత్త ఉపాయంతో సిద్ధమవుతుంటాయి) కానీ, అనేక మందికి ఆ ఫోన్లు చౌకగా అందకుండా పోయే అవకాశముంది.

చైనాఫోన్లవల్ల రేడియేషన్ సమస్య ఎక్కువ అన్నమాట కూడా ప్రచారంలో వుంది. అసలు మొబైల్‌ఫోన్ల వల్లే రేడియేషన్ సమస్య వున్నప్పుడు అది ఎక్కువా తక్కువా అన్నది అప్రస్తుతం. గంటల తరబడి సెల్‌ఫోన్‌లో మాట్లాడేవారికి తక్కువ మాట్లాడే వారికన్నా ప్రమాదం ఎక్కువ అది ఏ కంపెనీ ఫోన్లకైనా.

ఏది ఏమైనా 'చీప్ అండ్ బెస్ట్' అనేది ఎక్కడా వుండదు. నాణ్యమైనవి చవకగా లభించవు (ఖరీదైనవి నాణ్యంగా వుండాలన్న నిబంధన, హామీ కూడా లేదు). కాబట్టి మనమే జాగ్రత్తగా వ్యవహరించి 'మంచి' ఫోన్లు కొనుక్కోవడం మంచిది.

ఐఎంఇఐ అంటే?

మొబైల్‌ఫోన్లలో జిఎస్‌ఎం, జిడిఎంఎ, శాటిలైట్ ఫోన్లని వున్నాయి. వాటిలో జిఎస్‌ఎం (గ్లోబల్ సిస్టమ్ ఫర్ మొబైల్ కమ్యూనికేషన్స్) అనే రకం ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొంది, వాడకంలోవుంది. ఐఎంఇఐ నెంబరు (ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ) ప్రతి జిఎస్‌ఎం ఫోనుకీ ప్రత్యేకంగా వుండే నెంబరు ఈ 15 అంకెల సంఖ్య ప్రతి మొబైల్‌ఫోన్‌కీ వుంటుంది. ఏ రెండు ఫోన్లకీ ఒకే ఐఎంఇఐ నెంబరు ఉండదు. మొబైల్ ఫోన్ నుండి ఫోన్ కాల్స్ ఆపడానికి ఈ నెంబరు ఉపయోగపడుతుంది. ఒకవేళ ఫోన్ చోరీ జరిగితే ఆపరేటర్లకి ఐఎంఇఐ నెంబరు ఇస్తే వాళ్లు ఆ ఫోన్‌ను బ్లాక్ చేస్తారు. ఇంకా గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జిపిఎస్) సహాయంతో ఆ ఫోన్ ఎక్కడవుందో కనుక్కోవచ్చు. అయితే ఇదంతా చెప్పినంత తేలిక కాదు, పైగా సమస్య తీవ్రతనుబట్టే వీలౌతుంది. సామాన్యుల ఫోన్లు పోయాయని ఐఎంఇఐ నెంబర్లు ఇస్తే ఆపరేటర్లు స్పందించడం అరుదు. అయినా పోయిన ఫోన్ ఐఎంఇఐ నెంబరు ఆపరేటర్లకి ఇస్తే, వారు దాన్ని బ్లాక్ చేస్తే, ఫోన్ దొంగిలించినవారు ఎలాగూ దానిని వాడలేరు కాబట్టి చోరీలు తగ్గుతాయని ఆశ.

చవకరకం- చైనా ఫోన్లలో అసలైన ఐఎంఇఐ నెంబర్లు ఉండకపోవచ్చు. కానీ ఒక సాఫ్ట్‌వేర్ ద్వారా అసలైన నెంబర్లు ఏర్పరచుకోగలిగే వీలుంది. అటువంటి సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసి మార్చి నెలాఖరుకల్లా అందుబాటులోకి తేవాలని ప్రభుత్వ ప్రయత్నం. వందరూపాయలతో చైనాఫోన్ల ఐఎంఇఐ నెంబర్లు (నిజమైనవి) పొందగలిగే వీలు అప్పుడు కుదురుతుంది. ❋

పోయిన ఫోన్ ఐఎంఇఐ నెంబరు ఆపరేటర్లకి ఇస్తే, వారు దాన్ని బ్లాక్ చేస్తే, ఫోన్ దొంగిలించినవారు ఎలాగూ దానిని వాడలేరు.



మహోర్‌గఢ్ కోట...!

"కాలరాత్రి జీవిత యాత్ర
పొద్దు గడవదు.. కూర్చునేందుకు వీలులేదు...
ఒంటరిగా, ఒంటరిగా మంటల్లో మాటల్లో
పయనిస్తున్నాడు నరుడు
తానెరుగని దిక్కుకేసి..."

పర్యటనలు విజ్ఞానదాయకాలు... జీవితంలో అవి గొప్ప అనుభూతుల్లా, అనుభవంలా చిత్రించబడితేనే అందం, అర్థం కూడా!

పర్యటనలో చరిత్ర... చరిత్రలో తారీఖులు, దస్తావేజులు... ప్రతి చరిత్రలో ఏవో నీహార లేశాలు ఉండనే ఉంటాయి.

ఆదిలాబాద్!

ఆంధ్రప్రదేశ్‌కు కిరీటంలా ఉత్తరభాగాన ఉన్న అందమైన అడవుల జిల్లా. సువిశాలమైన ఈ జిల్లాకు ఉత్తరాన మహారాష్ట్రలోని 'యవత్‌మాళ్' జిల్లా, తూర్పున 'చంద్రపూర్, గఢబిరోలీ జిల్లాలు, పడమట 'నాందేడ్' జిల్లా, ఇలా మహారాష్ట్ర ప్రాంతం ఆత్మీయంగా అలుముకుని ఉంది.

ఒకప్పుడు ఈ ప్రాంతాలన్నీ 'కాకులు దూరని కారడవులూ... చీమలు దూరని చిట్టడవులు' ఉన్న దండకారణ్య ప్రాంతం.

పెద్దోళ్ల పుణ్యమా అని దోచుకున్నది పోనూ ఇంకాస్త 'కారడవి'-'చిట్టడవి' మిగిలి ఉంది.

మహారాష్ట్రలోని మరట్వాడా ప్రాంతం, మన తెలంగాణా ప్రాంతం ఒకప్పుడు నిజాంవారి స్వంత ఆస్తి... స్వంత రాజ్యం..!

షికార్లూ.. వేట విరివిగా సాగిన ప్రాంతం!

ఆదిలాబాద్ పట్టణం హైద్రాబాద్ నుండి 300 కిలోమీటర్ల దూరం.

ఉత్తరప్రదేశ్‌లోని 'బనారస్' (కాశీ తీర్థస్థానం/ వారణాసి) నుండి కన్యాకుమారి దాకా సాగిపోయే రాష్ట్రీయ మహామార్గం నెంబర్ 7 ఆదిలాబాద్ గుండెలోంచి నేరుగా మహారాష్ట్రలోని నాగపూర్ ద్వారా ముందుకు సాగుతుంది. ఉత్తరాది- దక్షిణాదిని కలిసే అలనాటి చరిత్ర చూసిన మార్గం అది. అయితే, కాస్త ఎడంగా 'మొఘల్ సామ్రాజ్యం'. శివాజీల రోజుల్లో 'మహోర్‌గఢ్ మీదుగా సాగేదని చరిత్ర చెప్తుంది.

'మహోర్‌గఢ్' ను టూకీగా 'మహోర్' అని పిలుచుకుంటారు.

ఆదిలాబాద్ నుండి 'జస్ట్ 85 కి.మీ. మాత్రమే'!

- డా॥జె.పి.వైద్య

అంతో-ఇంతో చరిత్ర. అంతకన్నా ఎక్కువ మందిరాలు- హర్మ్యాలు, ఇంకా ఎక్కువ పచ్చపచ్చటి హరిత హరిత అడవులున్న ప్రాంతం.

పదండి! భక్తి ప్రపత్తులు ఉన్నా లేకున్నా నైసర్గిక అందాలకూ చరిత్రనూ ప్రేమించే ప్రయాణీకులుగా 'పయనించి వద్దాం! రండి.

ఆదిలాబాద్ నుండి 'మహోర్'కు బస్సులున్నాయి.

స్వంత వాహనాలు- కార్లూ ఉన్నా 'రయ్'మని వెళ్లలేము.

అడవుల గుండా సాగే ప్రయాణం కాబట్టి 'ఝట్కాలూ..ధక్కాలు'

కొన్నైనా తప్పవు. మధ్యలో 'లంబాడీ తండాలు' కన్పిస్తాయి.

గంట ప్రయాణంలో 'ఉనక్‌దేవ్' లేదా 'ఉన్‌కేశ్వర్' అనే చిన్న 'కుగ్రామం' అడ్డుకుంటుంది.

వందల సంవత్సరాల చరిత్ర ఉన్న 'ఉన్‌కేశ్వర్' ఒకప్పుడు తపస్సు చేసుకునే సాధువుల అడ్డా!

దట్టమైన అడవుల మధ్య 'ఔషధ విలువలున్న వనమూలికలు' పుష్కలంగా లభించేవి. అక్కడ 'వేడినీటి బుగ్గలు'... పక్కనే 'చన్నీటి ఊటలు' ఉండేవి. పిడికెడు బియ్యం మూటలో కట్టి జనం అడవుల్లో ఔషధమొక్కలు వెతుక్కునో, ఏ వేటనో సాగించి వచ్చేసరికి 'అన్నం' తయారై ఉండేది వేడివేడిగా.



వైద్య పరిభాషలో అవి 'గంధకం బుగ్గలు'... సల్ఫర్ స్ప్రింగ్స్ అన్నమాట. గంధకానికి 'చర్మవ్యాధి, కుష్టురోగ నివారణలో పాత్ర ఉంది. కాబట్టి కుష్టు రోగులు తరచూ వేడినీటి స్నానాలకోసం బారులు కట్టేవారు.

దట్టమైన అడవుల్లో వందల సంవత్సరాలనాడు కట్టిన రాతి శివలింగం, మందిరం, దత్తమందిరం ఇంకా చెక్కుచెదరకుండా ఉన్నాయి. అయితే, తపస్సు చేసే మునీశ్వరులూ, సాధువులూ మాయమైపోయారు. కాస్తంత వ్యాపారదృష్టి, ముందు జాగ్రత్త చర్యల్లా 'వేడినీటి ఊటలు' చుట్టూ ఇనుప కడ్డీల కంచెల అవరోధాలు, టిక్కెట్లు వగైరా వచ్చేశాయి.

ఎంతటి వ్యాపారం వచ్చినా– ఊటల్లో వేడి తగ్గలేదు. రెండడుగుల వ్యత్యాసంలోనే 'వేడి'– 'చల్లటి' ఊటలు ఒక గమ్మత్తైన ఫీలింగ్.

ఆయుర్వేదాల 'రెడీమేడ్ ఐటమ్స్'– 'సబ్బులు' ఉన్న స్టాల్ కూడా వెలిసింది. అక్కడి నుండి మన మజిలీ – 'సార్కాణీ' వైపు. కుడివైపు తిరిగి నేరుగా సాగిపోతే కాస్తంత పలచబడ్డ అడవుల్లోంచి దూరంగా ఎత్తైన పర్వత శిఖరాలు కన్పిస్తాయి. రెండు– మూడు 'ఎస్' లాంటి ఎక్కుడు మార్గం వచ్చేసరికి విశాలమైన కోట స్పష్టంగా కన్పిస్తుంది.

భూతాలు, ప్రేతాలు, చేతబడీ, క్షుద్రవిద్యలను ఇంకా గుడ్డిగా విశ్వసించే వారికోసం కొండ దిగుడు దగ్గర ఒక మందిరం లాంటిది కన్పిస్తుంది. ఆ రోజుల్లో 'భూతవైద్యుల' అడ్డా అది!

ఇప్పుడు 'అంధవిశ్వాసాల ముసుగులో సాగే వ్యాపారం కబ్జా! గుడ్డిగా దేన్నీ నమ్మని వారు ఆ అడ్డాను చూసీ చూడనట్టు సాగిపోవాలి. ఎదురుగా కొండ ఎక్కే తారు రోడ్డు. కుడివైపు మహారాష్ట్ర ప్రభుత్వం బస్‌స్టేషన్... మరాఠీలో 'యస్‌టీ స్టాండ్' అని ముద్దుగా పిలుస్తారు. మనం 'బస్సొచ్చింది రోయ్' అంటే వాళ్లు 'యస్‌టీ ఆలీ' అంటారు. యస్‌టీ స్టాండ్ అంటే బస్‌స్టాండ్ ముందు ఒక గల్లీ లాంటిది కన్పిస్తుంది. పూలు, పండ్ల గంపలు, ధాన్యం బస్తాలూ, గజిబిజిగా సాగే పల్లెటూరి బజారు. ఒకప్పుడు ఉత్తరాది మొగల్ సామ్రాజ్యాన్నీ– దక్షిణాది రాజ్యాలనూ కలుపుతూ సాగిన మహామార్గం అది అంటే ఎవరూ నమ్మరు.

కాస్తంత ఇరుగ్గా కన్పించే బజారులోంచి 'తప్పుకో బిడ్డా– జరా హటో భైసాబ్' అంటూ సాగిపోతే కాస్తంత దూరంలో కుడివైపు చిన్న శిధిలాల కొంప, చెట్ల గుంపూ కన్పిస్తుంది. అది అలనాటి నిజాం ప్రభువుల జమానా 'పోస్ట్ ఆఫీస్' – టపాఖానా. ఇప్పుడు చిరుగుల కార్డులు కూడా కన్పించవు. యధేచ్ఛగా సంచరించే మేకలూ, గాడిదలూ కన్పిస్తాయి. అలనాటి 'టపాఖానా' కార్డ్ ముక్కలు కూడా మేయడానికి లేకున్నా గుడ్డిగా సంచరిస్తుంటాయి. ఎడంవైపు పెద్ద పెద్ద కమాన్లున్న రాతి కట్టడం నిశ్శబ్దంగా పలకరిస్తుంది. అది అలనాటి 'పీల్‌ఖానా'... ఏనుగుల నివాస స్థలం. చెరుగ్గడలు, నముల్తూ, తొండం ఊపుతూ, మెడలో గంటల గణగణల నాదం నేడు లేదు. అది నేటి 'మ్యూజియం'. లోపల 'స్టఫ్డ్ పులి'. అలనాటి కత్తులూ, కటార్లూ, భాలాలు, జంబియాలు, ఆదివాసీయుల ఆభరణాలు గట్రా చూడొచ్చు.

పక్కనే నేటి రక్షక భటుల నివాసం... పోలీస్‌స్టేషన్ కన్పిస్తుంది. అరచేతిలో సున్నం, పొగాకు మిశ్రమం తయారుచేస్తూ, నిలబడే పడుకునే ఆదర్శ పోలీసులు దర్శనమిస్తారు. ఇంకాస్త ముందుకు సాగి కుడివైపు తిరిగితే అల్లంత దూరాన ఒక మట్టిగోడల పెద్ద మేడ... రాతి మెట్ల హవేలీ... పెద్ద పెద్ద దూలాల ఇంతెత్తు గుమ్మం కన్పిస్తుంది. అది అలనాటి రాజవంశజుల హవేలీ. మొన్నటిదాకా మాహోర్ సంస్థానపు ఆఖరు రాజకుమారుడు –88 సంవత్సరాల చిరునవ్వుల నవయువకుడు 'రాజే మధూకర్ రావ్ దేశ్‌ముఖ్' గారు అక్కడ శాస్త్రీయ సంగీతం కూనిరాగాల్లో గున్‌గునాయిస్తూ విశాలమైన హాల్లో సోఫాల్లో కన్పించేవారు. ఆరు అడుగుల నిండైన విగ్రహం... అద్దాల చాటున ముసిముసిగా నవ్వులతో పలకరించే కళ్లు... బహుభాషాకోవిదుడు... గొప్ప షికారీ... ఉర్దూ, అరబ్బీ, ఫారసీలో కవిత్వం చెప్పే సాహితీవేత్త... పంజాబ్ గవర్నర్‌గా పనిచేసిన జనరల్ బిబ్బర్ సహాధ్యాయి... హవేలీలో పులుల జంటను కొన్ని సంవత్సరాలు పెంచి నిజాం అధికారులతో గొడవపడ్డ అభిమాని... నేడు ఆయన లేరు.

ఆయన ముత్తాత... ముత్తాత... ముత్త... ఒకప్పుడు ఔరంగజేబు సైన్యంలో అధికారిణి. సూరత్ కొల్లగొట్టి వస్తున్న శివాజీని ధైర్యంగా ఎదుర్కొన్న వీరవనిత. అసమాన శౌర్య పరాక్రమాలున్న రాచకన్నె... పాదుషావారు 'రాయ్‌బాగన్' (ఆడపులి) అని బిరుదిచ్చి సత్కరించాడు. అవన్నీ చరిత్ర పుటల్లో ఉన్నాయి. ఓపికున్నవారు 'ఛత్రపతి శివాజీ' చరిత్రను తిరగేసి చూడొచ్చు.

ఆ హవేలీలో కొన్నాళ్లక్రితం 'మహోర్ సంగీత కళాశాల' సాగింది. ఇప్పుడు పాఠశాల సాగుతుంది.

ఆ రాజవంశజులు కోటను వదిలి మాహోర్ గ్రామానికి వచ్చి వందల సంవత్సరాలు దాటాయి. హవేలీ ముచ్చట్లు, రాజే–నిజాం జమానా హవేలీలో సాగే రమ్యరాత్రుల ముచ్చట్లు... షికార్ (వేట) ముచ్చట్లు ఎన్నో. ఆ ముచ్చట్లను వదిలేసి మనం పడమటి దిశలో సాగి కోటవైపు వెళ్లే రోడ్డువైపు కదిలిపోదాం. రండి! ఒకప్పుడు యాదవులు, బహమనీ, మొగల్, నిజాం, ఆంగ్లేయులు... ఇలా తరతరాల రాజవంశజులతో ముడివేసుకున్న అలనాటి చరిత్రను రాతి దస్తావేజులుగా గుండెలో దాచుకున్న విశాలమైన కోట.

పెద్ద పెద్ద నల్లటి చతురస్రాకారపు రాళ్లతో నిర్మించిన, శత్రుదుర్భేద్యమైన కోట అల్లంత దూరంనుంచే అందమైన ఆకుపచ్చ చెట్ల తివాచీ కప్పుకున్నట్లు ఠీవీగా తలెత్తి దర్శనమిస్తుంది. అక్కడక్కడ జవసత్వాలు ఉడిగినట్టు బురుజులు కాలగర్భంలో కలిసిపోయినా నీలిరాళ్ల తాపడాలు చేసిన రెండు ఏనుగుల ఎత్తు 'ఢిల్లీ దర్వాజా' ఇంకా మొండి ఠీవీతో నిలబడి ఉంది.

లోపల ఇరువైపులా ఇంతెత్తు రాతి చప్టాలు. దాటి ఎడమవైపు తిరిగి చూస్తే ఒక పెద్ద శిధిలాల గది కన్పిస్తుంది. అది అలనాటి 'బారూద్ ఖానా' ... కొంతమంది ఔత్సాహికులు గుండెధైర్యంతో మెట్లు దిగి, ఛాతీ విరుస్తూ శ్వాస ఎగబీల్చి– 'అరే గంధకం వాసన ఇంకా వస్తున్నది రోయ్' అంటే మనం నవ్వుతాం తమాషాగా! కానీ అది వాస్తవం... టన్నుల కొద్దీ గంధకం నిలవుండేది ఆ రోజుల్లో..! 'ఏమ్రా! అలా చూస్తారేమిటీ భయం భయంగా! ఔరంగజేబు పన్నెండేళ్ల చిరుప్రాయంలో ఆ బురుజుల్లో దాగుడు మూతలాడిన ఘనత నాది నాయనా! ఇప్పుడు ఆ ఔరంగజేబూ లేడు... అతన్ని ముప్పతిప్పలు పెట్టిన మరాఠీ కొదమసింహం ఛత్రపతి శివాజీ లేడూ..! ఉంటే గింటే నా బురుజుల శిధిలాల్లో, సగర్ బాటల పొదరిండ్ల చాటున ఇంకా చిరుతపులులూ, కొండ చిలువలూ ఉంటాయి. అయినా

భయపడకుండా రండర్రా..! అదంతా 1664నాటి రాయబాగన్ చరిత్ర... అన్నట్లు ఢిల్లీలో రాజరికం రాజకీయాల హత్యల 'లొల్లి'కి భయపడి దక్షిణాదికొచ్చిన షాజహాన్, ముంతాజ్ మహల్‌ను ఆత్మీయంగా చూసుకున్నారు కోటలోని మరాఠీ రాజులు... తర్వాతి కాలంలో షాజహాన్ తాజ్‌మహల్ కట్టి ప్రపంచ వింతల్లో మనకు ప్రత్యేకత నిచ్చాడు. మరాఠీ రాజులకు వేలకొద్దీ ఎకరాల 'జమిందారీ' ఇచ్చాడు. అని చరిత్ర చెప్పే నిశ్శబ్దమైన రాతికోటను పలకరిస్తూ -ఎదుట 'రేణుకా మాతా' మందిరంలోని గంటల మంజులనాదం పలకరిస్తుంది.



గోవాలోని 'ఫిగర్ ఆఫ్ త్రీ' గా వ్యాపించాయి. 'దోనా పావలా'- 'ఫోర్ట్ అగోడా' - 'మార్మాగోవా' ల్లాగే కోటను చుట్టిన మూడు శిఖరాల హరితమైన అందాల్లో 'రేణుకా మాతా' మందిరంతో పాటు, దత్తమందిరం, అనసూయా మాతా మందిరాలూ, లెక్కలేనన్ని మంచినీటి కుద్యాలూ, నలువైపులా పలకరించే పచ్చదనం, చల్లటి గాలులూ ఉంటాయి. 'మహోర్'లో!

ఒకప్పుడు రాజరికం ఠీవీతో, దర్పంగా 'హుకుం' -'ఫర్మానా'లు వెలువడ్డ కోట నిశ్శబ్దంగా ఉన్నా- మహారాష్ట్రీయుల ఆరాధ్య దైవాలున్న 'పీఠం'... ఇంకా జనసమర్దాన్ని పెంచుతూనే ఉంది.

భక్తి ప్రపత్తులున్న వారికి మందిరాలు, వ్యాధిగ్రస్తులకు 'స్ప్రింగ్స్'. చరిత్రకారులకు శిధిలాల హవేలీ. ప్రకృతి నేస్తాలకు హరితం, నీలిరంగుల నయన రమ్య కాంతులు... కళ్లు మూసి 'చరిత్ర' నెమరువేసుకునేవారు. కళ్లు తెరిచి చూస్తే మనచుట్టూ ఎంతో 'చరిత్ర' ఉన్నదన్న సత్యాన్ని గమనించాలనుకుంటే- 'ప్రయాణాలు' సాగించక తప్పదు. అవి చరిత్రలో కలిసిపోయిన మహా మార్గాలైనా సరే..!

❋

దంతబలుడు



'హలో...హాయ్! ఏవండోయ్! నోరు తెరుచుకుని చూసింది చాలుకానీ...మూస్తే నయం. లేకపోతే అదేదో సొరంగమనుకొని లోపలికి గుడ్డి ఈగలు, దోమలు దూరిపోగలవు జాగ్రత్త.

'ఆ...మేం మరీ అంత ఇదిగా ఏం చూడ్డంలేదుగానీ...ఏదో కాస్త...ఆశ్చర్యంగా అనిపించీ....చూస్తున్నామంతే...ఇంతకీ ఆయన ఎవరండీ...ఏకంగా పళ్లతోనే బస్తా ఎత్తేశాడు?'

'అవన్నీ తర్వాతండీ...ముందు మా ప్రశ్నకు సమాధానం చెప్పండి. మీరు పళ్లు ఏ టూత్ పేస్ట్‌తో శుభ్రం చేసుకుంటారు?'

'ఏవండీ...ఏమన్నా అంటే కోపం వస్తుందికానీ... అసలు మేం అడిగిన దానికీ మీ ప్రశ్నకూ సంబంధం ఏమైనా వుందా?'

'లేకేం చాలా వుంది. ముందు మా ప్రశ్నకు జవాబు ఇవ్వండీ'

'ఏదో చవకది అంటామనుకున్నారా? కానే కాదు. మేం చాలా చాలా పేరున్న జిగేల్ జిగేల్ టూత్‌పేస్ట్ ....వాడతాం. అందుకే మా పళ్లు ఇలా తళతళా మెరుస్తున్నాయి. ఆరోగ్యంగా వున్నాయి'

'అవునా...మరైతే మీరు కూడా అలా ఆ మనిషిలాగా పళ్లతో బస్తాలు ఎత్తుతారా?'

'హలో...భలే వారే. మేం ఇలా అందంగా వుండడం ఇష్టంలేదా ఏంటి?'

'అంటే మీదంతాలు ఆయనలా గట్టివి కావన్నమాట...'

'ఇంత విపులంగా చెప్పాక ఒప్పుకోక చస్తామా ఏంటి? ఇంతకీ ఆయన పేరు, ఊరు...ఎప్పటినుంచి బస్తాలను ఎత్తుతున్నాడు? వంటివన్నీ చెప్పేయండి ప్లీజ్'

'మీరు అలా అడిగాక కాదంటామా ఏంటి? ఈయనగారి పేరుకు చేసే పనికి అస్సలు పొంతన వుండదండీ. కావాలంటే మేం పేరు చెప్పాక నిజమేనంటారు....'

'అబ్బా...సోది ఆపి పాయింట్‌లోకి రండీ'

'ఆయన పేరేంటంటే ....చెంచారావు...కన్నెల చెంచారావు'

'వ్వాట్...చెంచారావా?!'

'య్యస్. ఆయనది ప్రకాశం జిల్లాలోని ముండ్లమూరు....ఇరవైఆరేళ్లు. తాపీ పని చేసుకొని రోజులు నెట్టుకొస్తుంటాడు'

'అసలు ఈ పని ఎప్పటినుంచి చేస్తున్నాడేంటి?'

'ఆ...తాపీ పని చేస్తున్నప్పట్నించే... అలా చిన్న చిన్న బరువులతో మొదలెట్టి ఇవాళ 76 కేజీల బస్తానైనా ఈజీగా ఎత్తే రేంజ్‌కి ఎదిగాడు. దంతబలుడుగా నిలిచాడు'

'ఇంతకీ ఆయన దంతాలను ఏ పేస్ట్‌తో శుభ్రం చేసుకుంటాడో'

'ఏం...టో...నా! వేపపుల్లతోనే. చిన్నప్పటి నుంచి స్వచ్ఛమైన వేపపుల్లలతో పళ్లు తోముకోవడం వల్ల తన పళ్లు గట్టిగా అయ్యాయని, ఎంత బరువు లేపినా ఎలాంటి సమస్య ఎదురుకాలేదని చెప్తున్నాడు తెల్సా!'

'నిజమా! మరైతే ఆయన మనసులోని మాట ఏదైనా చెప్పండి'

'ఏమంటాడు పాపం! తను గ్రామంలో వుండడంవల్లే పళ్లతో ఇంతింత బరువులను ఎత్తుతున్నా వెలుగులోకి రాలేదని ప్రభుత్వం శ్రద్ధ తీసుకొని దీన్ని కూడా క్రీడల్లో చేర్చాలని చెంచారావు కోరుకుంటున్నాడు'

'నిజమే సుమా'

బి. ఏలియా, అద్దంకి.

ఆరోగ్యం

మెదడులో కణితులు

శరీరంలోని ఇతర అవయవాల్లోకెల్లా మెదడు చాలా ముఖ్యమైన అవయవం. సున్నితమైనదీను. ఇది శరీరంలో అన్ని భాగాలను నియంత్రిస్తుంది. మెదడుకు వచ్చే వ్యాధులను అశ్రద్ధ చేస్తే ప్రాణాపాయం సంభవించే అవకాశముంది. ఆ వ్యాధుల్లో మెదడులో ఏర్పడే కణితి ఒకటి. దీన్నే బ్రెయిన్ ట్యూమర్ లేదా బ్రెయిన్ క్యాన్సర్ అంటారు. అసలు ఈ వ్యాధిని నిర్ధారించడం ఎలా? ఏమేం పరీక్షలు చేస్తారు? లక్షణాలేంటి? చికిత్స ఏంటి? వంటి విషయాలు ఈ వారం తెలుసుకుందాం.



డా॥ వేమూరి నాగశంకర్,
న్యూరో సర్జన్,
రాఘవేంద్ర సూపర్ స్పెషాలిటీ న్యూరో సెంటర్
మరియు ఎమర్జెన్సీ హెడ్ ఇన్‌జ్యూరీ కేర్,
కొత్తపేట, నెహ్రూనగర్ రోడ్, గుంటూరు.
సెల్: 9247862689

మెదడులో ఏర్పడే కణుతుల్లో కొన్ని అతి వేగంగా, మరికొన్ని నెమ్మదిగా పెరుగుతాయి. వాటి లక్షణాలేంటో చూద్దాం.

లక్షణాలు

తలనొప్పి, వాంతులు, ఫిట్స్, పక్షవాతం (ఒక కాలు చేయి పడి పోవటం లేదా చూపు మందగించడం) వంటి లక్షణాలు కనిపిస్తాయి. వీటిలో ఏవైనా రెండు లేదా మూడు లక్షణాలు ఉండొచ్చు లేదా అన్ని లక్షణాలు ఉండొచ్చు. వేగంగా పెరిగే కణితిలో ఈ లక్షణాలు త్వరితంగా వస్తాయి. అతి నెమ్మదిగా పెరిగే కణితిలో పైన వివరించిన లక్షణాలు ప్రారంభదశలో ఉండకపోవచ్చు. దీర్ఘ కాలికంగా వచ్చే తలనొప్పి కాని, క్రమేణా చూపు మందగించడం కాని తరచూ వాంతులు రావటం ద్వారా ఫిట్స్ రావటం కాని, లేదా జ్ఞాపకశక్తిలో తేడా కాని, లేదా మనిషి ప్రవర్తనలో ఆకస్మిక మార్పులు రావడం. అనగా పిచ్చిగా ప్రవర్తించడం లాంటి లక్షణాలు ఉన్నచో వెంటనే మెదడుకు సంబంధించిన వైద్య నిపుణుల సలహాలు పాటించాలి. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే న్యూరో స్పెషలిస్టును సంప్రదించాలి.

ఇతర క్యాన్సర్ల నుంచీ...

మధ్య వయస్సులో, 60 ఏళ్లు దాటిన వారిలో కొన్ని రకాల క్యాన్సర్లు శరీరంలో వివిధ భాగాల నుండి మెదడుకు రక్తం ద్వారా వ్యాపిస్తాయి. ఉదాహరణకు ఊపిరితిత్తుల క్యాన్సర్, పేగుల క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ మెదడుకు వ్యాపిస్తాయి. మెదడు క్యాన్సర్లను ప్రాణాంతకమైనవిగా భావిస్తారు. మరికొన్ని ప్రాథమిక దశలో గుర్తిస్తే ఆపరేషన్ ద్వారా తగ్గించవచ్చు.



నిర్ధారణ పరీక్షలు-చికిత్సలు

మెదడు క్యాన్సర్ నిర్ధారణకు తల ఎక్సరే, సిటి స్కానింగ్, యం.ఆర్.ఐ. స్కానింగ్, అత్యాధునికమైన ఎం.ఆర్.యస్ స్కానింగ్, పెట్ స్కానింగ్ పరీక్షలు చేస్తారు. 'స్టీరియోటాక్టిక్ బయాప్సి' పరీక్ష ద్వారా మెదడులోని క్యాన్సర్ కణాలను చిన్న పరిమాణంలో బయటకు తీసి ఏ స్టేజిలో ఉందో గుర్తిస్తారు. గ్రేడు-1, గ్రేడు-2 గ్లయోమ ట్యూమర్లను ముందే నిర్ధారిస్తే మెదడు ఆపరేషన్ ద్వారా తొలగించవచ్చు. గ్రేడు-3, గ్రేడు-4 క్యాన్సర్‌కు ఆపరేషన్ కాకుండా కీమో థెరపీ, రేడియోథెరపీ ఇస్తారు. గ్రేడు-4 క్యాన్సర్ చాలా ప్రమాదకరమైంది.

చాలా వరకు క్యాన్సర్లు ప్రాథమిక దశలో గుర్తిస్తే ఆ రోగి జీవిత కాలాన్ని పొడిగించే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి. కొన్ని రకాల మెదడులో గడ్డలు ఆపరేషన్ ద్వారా తొలగిస్తే జీవన ప్రమాణాన్ని పెంచే అవకాశముంది.



కథ

సరదాగా ఓ కల

మూలం : విలియం బట్లర్ ఈట్స్

డ్రీమ్స్ దట్ హేవ్ నో మోరల్

అనువాదం : ముక్తవరం పార్థసారథి

"చలికాలంలో ఈగలు ముసిరినట్టుగా గుమిగూడారు కూలీలక్కడ" అందావిడ. క్షణం విరామం లేక ఎప్పుడూ ఏదో ఒకటి వాగుతూనే ఉంటారట. కావచ్చు కాని ఆ మాటల్లోనే వాళ్లు ఎముకలు కొరికే చలిని మరిచిపోగలరు. కాయకష్టం చేసినా కడుపు నిండని వాళ్లు స్వప్నలోకంలోనే సుఖాలనన్వేషిస్తారు. ఒకడు దేవకన్యతో పేకాట ఆడుతాడు. మరో ముసలాడికి మహిమలుగల నల్లపంది కనిపిస్తుంది. రాఫ్టెరీ, కలానన్‌లలో ఎవరు గొప్ప కవి అని వాదించుకుంటూ గడుపుతారు కొందరు.

"రాఫ్టెరీ గొప్పవాడు. అతని పాటలు తెలియనివాడు భూప్రపంచంలోనే లేడు, కాని కలానన్ పాటల కోసం గడ్డకట్టే చలినైనా భరించగలం.' ఈలోగా కథ చెప్పటం ప్రారంభించాడొకడు.

అందరూ తమతమ కబుర్లాపి ఆసక్తిగా విన్నారు. ఏ కాస్త ఆనందం కలిగినా నవ్వాపుకోలేం. ఆ కథే ఇప్పుడు మీకు చెప్పబోతున్నాను. వీళ్ల కథలో గొప్ప సందేశాలూ, తెలుసుకోవాల్సిన విషయాలూ వుండవు. విన్నంతసేపూ చలిని మరిపించగలిగితే చాలు. కానీ కనీసావసరాలు తీరటం కోసమే వాళ్లు వొళ్లు హూనం చేసుకుంటారు. అలాంటి అమాయకులు చెప్పుకునే కథల్లో ఆలోచించి తెలుసుకోవాల్సిన అంతరార్థమేమీ ఉండదు. మనం కార్యకారణ సంబంధాల్ని గురించి ఆలోచిస్తాం. ఏదైనా జరిగితే పరిణామం ఎలా ఉండబోతోందోనని విశ్లేషిస్తాం. కాని వాళ్ల ప్రకారం అనగనగా ఒక కాలంలో మనుషులందరూ నిర్విచారంగా బతికేవాళ్లు. భవిష్యత్తును గురించిన బెంగలేదు. మనసు మంచిదైతే చచ్చిన వాళ్లను కూడా మంత్రదండంతో బతికించవచ్చు. రాజుకూ, నీకు పోలికలుంటే, అతడి అంతఃపురంలోకి ప్రవేశించి రాణితో కీడ్రించవచ్చు. మహా అయితే పొరబాటు జరిగినందుకు అతడు కాస్త చికాకు పడతాడు. బలహీనులందరూ కలల్లోనే తమ స్వర్గం వెదుక్కుంటారు. ఇందుకు మీరూ, నేను కూడా మినహాయింపు కాదు. కలల రెక్కలతో ఎగిరితే బతుకుభారం తెలియదు.

> **ఆ మాటలు విన్న జాక్‌కు కోపం వచ్చింది. తన ఖడ్గంతో రాజు తల నరికెయ్యాలనుకున్నాడు. కాని రాకుమారిని చూసి మనసు కరిగిపోయింది. బూటు అతని కాలికి సరిగ్గా సరిపోయింది, జుట్టు కలిసింది.**

అనగనగా ఓ రాజు. ఆయనకు పుత్రసంతానం లేదు. ఏం చెయ్యాలో పాలుబోక ముఖ్యసలహాదారును సంప్రదించాడు.

"అదెంతపని! నేను చెప్పినట్టు చెయ్యండి. ఒక ప్రత్యేక జలాశయంలో (ఆ జలాశయం పేరు చెవిలో చెప్పాడు) చేపను పట్టి తెమ్మని సేవకుల్ని ఆదేశించండి. రాణీగారు దాన్ని తింటే మీ అభీష్టం నెరవేరుతుంది" అంటూ సమస్యను పరిష్కరించాడు ముఖ్య సలహాదారు.

చేపను తెచ్చారు. రాజు దాన్ని వంటమనిషికిచ్చాడు. ఆమె దాన్ని నిప్పులమీద కాల్చింది. అలా కాల్చినప్పుడు దాని చర్మం బొబ్బలెక్క గూడదు. కాని బొబ్బలెక్క కుండా కాల్చడం అసంభవం. ఒకటి రెండు చోట్ల చర్మం కాస్త పైకి లేవగానే వంటవాడు వేలితో నొక్కి ఆ వేలిని నోటిలో పెట్టుకుని రుచిచూశాడు. రాణి చేపను తిని మిగిలింది, పెరట్లో పడేసింది. అక్కడున్న ఓ ఆడగుర్రం, జాగిలం కిందపడిన ఎముకల్ని తిన్నాయి. ఏడాది తిరక్కుండానే రాణి ఓ పండంటి కొడుకును ప్రసవించింది. వంటావిడ కూడా మరో కొడుక్కూ గుర్రం, కుక్కా రెండేసి పిల్లలకూ జన్మనిచ్చాయి. కొన్నేళ్ల తర్వాత ఇద్దరు మగపిల్లలూ కవలల్లాగే కనిపించారు. ఎవరు ఎవరో పోల్చుకోవటం కష్టమైంది.

ఈ చిక్కుముడి విప్పమని ముఖ్య సలహాదారును ఆశ్రయించింది రాణి. తన కొడుక్కు అందే సౌఖ్యాలు, సౌకర్యాలు వంటమనిషి సంతానానికి కూడా లభించటానికి ఏరాణీ ఇష్టపడదు.

"అదెంత పని. మీరు ద్వారంలో నిలుచోండి. లోపలికి ప్రవేశించిన ఇద్దరిలో ఎవరు మీకు అభివాదం చేస్తాడో, అతడే మీ పుత్రుడు" అన్నాడు ముఖ్య సలహాదారు.

ఆ సలహా పాటించింది రాణి. తన కొడుకును పోల్చుకోగలింది, సాయంత్రం భోజనాలవేళ టేబుల్ వద్ద కూర్చున్న పని మనిషి కొడుకు జాక్‌తో

"నువ్వు నా సంతానం కాదు. ఇక్కడుండొద్దు" అని చెప్పింది నిష్కర్షగా.

"వాణ్ణెక్కడికీ పంపొద్దు. మేం సోదరులం కామా?" అంటూ కన్నీటి పర్యంతమయ్యాడు బిల్.

"మీరు నా స్వంత తల్లిదండ్రులు కాదని తెలిస్తే నేనెప్పుడో వెళ్ళిపోయేవాణ్ణి" అన్నాడు జాక్.

బిల్ ఎంత బతిమాలినా వినలేదు. చివరి మాటగా "నాకేదైనా ప్రమాదం జరిగితే, ఈ ఇంటి వెనక బావిలో నీటిపైన నెత్తురూ, లోపల తేనె పేరుకుపోతాయి" అంటూ కీలక రహస్యం ఒకటి చెప్పాడు అతడితో.

ప్రయాణంలో సహాయంగా వుంటాయని, చేపను తినగా పుట్టిన ఒక గుర్రంపిల్లనూ, కుక్కపిల్లను కూడా వెంట తీసుకెళ్లాడు జాక్. అలా వాయువేగంతో ముందుకు కదిలి ఒక రాజుగారింటికి చేరుకుని "మీకు సేవకులు కావాలా?" అంటూ వాకబు చేశాడు.

"ఆ నా పశువులను మేపటానికో కుర్రాడు కావాలి" అన్నాడు రాజు.

ఆ రోజు నుండి, ఇరవైనాలుగు ఆవులను మేతకు తీసికెళ్లాడు జాక్. కాని చుట్టు పక్కలంతా రాళ్ళూ, రప్పలే తప్ప గడ్డి లేదు. అల్లంత దూరంలో పచ్చదనం కనిపించింది. కానీ ఆ పొలం ఓ రాక్షసుడిది. చుట్టూవున్న కంచె కాస్త తొలగించి పశువుల్ని అందులో మేతకు పంపాడు. అక్కడే ఉన్న ఒక ఆపిల్ చెట్టెక్కి పళ్లు తింటూ కుర్చున్నాడు.

రాక్షసుడికి నరవాసన తగిలింది.

"ఐరిష్ నెత్తుటి వాసన వేస్తున్నది. ఎక్కడన్నావురా! ఆ చెట్టు పైనుండి దిగు. నువ్వెంత మనిషివి. ఒక్క పంటి కిందికి కూడా రావు. నిన్ను పిండి చేసి నశ్యంగా పీల్చుస్తాను" అంటూ హూంకరించాడు.

"బలవంతులకు దయాగుణం ఉండాలి " అన్నాడు జాక్.

"కిందికి దిగరా నీ అంతు చూస్తాను" అన్నాడు రాక్షసుడు.

జాక్ దిగి వచ్చాడు. ఇద్దరి మధ్యా భయంకరమైన యుద్ధం జరిగింది. గట్టిగా ఉన్నా నేల గుల్లగా మారింది. గుల్లనేల గట్టిపడింది. కత్తులతో గుచ్చిన చోట చెలమల్లోంచి నీరు పొంగింది. క్షణం విరామం లేక రోజంతా పోరాటం సాగింది. పొద్దుగూకుతున్నప్పుడు చెట్టు మీద వాలిన ఒక పక్షి" సూర్యాస్తమయంలోగా నువ్వు వాణ్ణి చంపకపోయావో వాడు నిన్ను

నమిలెయ్యటం ఖాయం" అని చెప్పింది జాక్ చెవిలో. రెట్టించిన ఉత్సాహంతో పోరాడి, జాక్ వాణ్ణి పాదాక్రాంతం చేసుకున్నాడు.

"నాకు ప్రాణభిక్ష పెడితే నీకో కానుకిస్తా" అన్నాడు రాక్షసుడు.

"ఏమిటా కానుక?"

"అనేక మహిమలున్న ఒక ఖడ్గం. కొండమీద ఎర్రద్వారం కనిపిస్తోందా, అందులో ఉంది"

జాక్ ఆ ఖడ్గాన్ని తెచ్చి రాక్షసుడి తల నరికి, అది మళ్లీ మొండెంతో అంటుకుపోకుండా దాన్ని మరో రెండు ముక్కలు చేశాడు.

"భలే పని చేశావు. తిరిగి బతికితే రాక్షసుడికి అమరత్వం సిద్ధించేది" అంటూ ప్రశంసించింది తల.

ఏమీ జరగనట్టే ఆ సాయంత్రం ఆవులను ఇంటికి తోలుకు వచ్చాడు జాక్. అవి రోజూకన్నా ఎక్కువ పాలిచ్చాయి. ఆ రాత్రి మూడుకు బదులు రెండు గర్జనలే విన్నాడు రాజు.

తెల్లవారి పశువులను తీసుకు పోయినప్పుడు జాక్‌కు పొలంలో రెండు తలల రాక్షసుడు ఎదురొచ్చాడు. మళ్లీ యుద్ధం జరిగింది. పక్షి వచ్చి జాక్‌కు మరో రహస్యం చెప్పింది.

పరాజితుడైన రాక్షసుడు "ఓ మంచి కానుక ఇస్తాను, రక్షించు" అని వేడుకున్నాడు. ఈసారి అది కొండ గుహలో దాచిన కవచం. దాన్ని ధరించి వచ్చిన జాక్ రాక్షసుడి రెండు తలల్ని నాలుగు ముక్కలు చేశాడు.

ఆ రాత్రి ఆవుల పొదుగుల నుండి పాలు ధారగా కారాయి. పట్టటానికి రాజభవనంలోని గంగాళాలు సరిపోలేదు. ఆ రాత్రి ఒక్క గర్జనే విన్నాడు రాజు.

తెల్లవారి మళ్లీ పశువులను మేపటానికి వెళ్లిన జాక్‌కు నాలుగు తలల రాక్షసుడు కనిపించాడు. అతడితోనూ యుద్ధం జరిగింది. ఓడిపోయిన రాక్షసుడు గుహలో బూట్ల జత ఉందని చెప్పాడు. వాటిని ధరించి వచ్చిన జాక్ వాడి నాలుగు తలలనూ ఎనిమిది భాగాలుగా ఖండించాడు. ఆ రాత్రి పాలు దాచుకోలేక వీధిలో పారబోశారు, దారినే వెళుతున్న నేను కూడా కడుపు నిండా తాగాను.

"పాడి ఇంత పెరగటానికి కారణమేమిటి? వాటినెక్కడ మేపుతున్నావు?" అని అడిగాడు రాజు.

దూరంగా ఉన్న పొలాలలో గడ్డి మేస్తున్నాయన్నాడు జాక్. ఆ రాత్రి రాజుకు గర్జనలు వినిపించలేదు. మరునాడు, పశువులతో వెళ్లిన జాక్‌ను రహస్యంగా వెంబడించారు రాజూ ఆయన కూతురూ. కర్రతో ఆవులను అదిలిస్తూ ముందుకు నడిచాడు జాక్. "అతడు చెప్పింది నిజమే. బాగానే తోలుతున్నాడు" అన్నాడు రాజు. ఆ కాలంలో రాజుగారి కూతుర్ని తినాలని ఏడేళ్లకొకసారి ఒక సర్పం వచ్చేది. దానితో యుద్ధం చెయ్యటానికి రాజు ఒక వస్తాదును పోషించాడు. వాడు యుద్ధవిద్యలో ఎంత ఆరి తేరాడోగాని, ముష్టాన్న భోజనం తిని బాగా బలిశాడు. సర్పం వచ్చే సమయానికి, రాకుమార్తెను ఓ చెట్టుకు బంధించి తనెక్కడో నక్కాడు. ఆ వస్తాదు అసమర్థుడన్న విషయం రాకుమార్తె ద్వారా తెలుసుకున్న జాక్ అక్కడికి చేరుకుని సర్పం కోసం నిరీక్షించాడు. అయితే తను రక్షిస్తానని మాత్రం ఆమెకు వాగ్దానం చెయ్యలేదు.

"నీ ఒడిలో తల పెట్టుకుని నన్ను విశ్రమించనీ, సర్పం వచ్చినప్పుడు చెప్పు" అన్నాడు. రాకుమార్తె అంగీకరించింది.

మరి కాసేట్లో భీకర సర్పాన్ని చూసి భయంతో కేక వేసింది. జాక్ లేచి ఖడ్గంతో దాన్ని సముద్రం దాకా తరిమేశాడు. ఆ తర్వాత ఆమె కట్లు కూడా విప్పాడు.

"నా తరపున నా మిత్రుడొకడు సర్పంతో యుద్ధం చేశాడివాళ. కాస్త బడలికగా ఉంది. రేపు నేనే యుద్ధం చేస్తానని" రాజుతో నమ్మబలికాడు వస్తాదు. రాకుమారి కూడా అతడు చెప్పిన దాంతో అంగీకరించింది. మరుసటి రోజుకూడా అలాగే జరిగింది. ఆమెను కట్టేసి, తనెక్కడో నక్కాడు వస్తాదు. ఆనాడు వచ్చిన సర్పాన్ని తన కవచంతో ఎదుర్కొన్నాడు జాక్. మరునాడు రాకుమారి మళ్లీ సముద్రతీరానికి వెళ్లక తప్పలేదు. ఈ సారి ప్రజలంతా ఆమెను చూడటానికి గుమిగూడారు. ముందే కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం రాకుమారి తన జుట్టు కొద్దిగా కత్తిరించి చెట్టు మొదట్లో పెట్టింది. జాక్ తొడుక్కున్న ఒక కాలి బూటు కూడా గుర్తుగా వదిలింది. సర్పం రాగానే, జాక్‌ను తన వొళ్లోంచి లేపింది.

"దీంతో ఇంకెవరికీ కష్టాలుండవు" అంటూ జాక్ ఖడ్గంతో దాని మీద లోతుగా గాటు పెట్టాడు. ఆ గాయం నుండి కారిన నెత్తురూ, నీరూ యాభై మైళ్ల దూరం ప్రవహించాయి. ఎప్పటిలాగే ఆరోజు వస్తాదు తనే పామును తరిమేశానని రాజుకు చెప్పాడు. ఎలాగైనా రాకుమారిని పెళ్లాడాలని వాడి యోచన. ఆ రాత్రి విందులో రాకుమారి రెండు షరతులు పెట్టింది. తన జుట్టు లాంటి జుట్టున్న వాణ్ణీ తను చెట్టు వద్ద వదిలిన బూటు పట్టే పాదం ఉన్న వాణ్ణీ మాత్రమే చేసుకుంటానంది. ఆ కాలు బూటు కన్నా పెద్దది. జుట్టు కూడా మరో రంగులో ఉంది. రాజు తన రాజ్యంలోని ధనిక యువకులందర్నీ ఆహ్వానించాడు. కాని ఎవరూ అర్హత సంపాదించలేక పోయాడు. పేద యువకులను కూడా పిలవమన్నాడు ముఖ్య సలహాదారు! కాని వాళ్లలో కూడా ఆమెకు వరుడు కాగలిగిన వాడొక్కడు లేడు.

"ఆ ఆవులు మేపే కుర్రాణ్ణి తప్ప అందర్నీ పిలిచాను" అన్నాడు రాజు. ఆ మాటలు విన్న జాక్‌కు కోపం వచ్చింది. తన ఖడ్గంతో రాజు తల నరికెయ్యాలనుకున్నాడు. కాని రాకుమారిని చూసి మనసు కరిగిపోయింది. బూటు అతని కాలికి సరిగ్గా సరిపోయింది, జుట్టు కలిసింది. రాజు ఇద్దరికీ ఘనంగా పెళ్లి జరిపించాడు. మూడు రోజులు విందు వినోదాలు కొనసాగాయి.

నాలుగో రోజు ఉదయం మెడకు గంటలు కట్టిన ఒక జింక అటువైపు పరిగెత్తుకు వచ్చింది.

"దాన్ని వేటాడండి!" అంటూ ఆదేశించాడు రాజు.

గుర్రమెక్కి జాగిలం వెంట రాగా దాన్ని వెంబడించాడు జాక్. రోజంతా శ్రమించినా చిక్కలేదు జింక. అడవులు కొండలు దాటి అది ఒక పూరింట్లోకి ప్రవేశించింది. లోపలికి తొంగిచూసిన జాక్‌కు రెండువందలేళ్ల వయసున్న ముసలావిడ వంట చేస్తూ కనిపించింది.

"జింకేది?" అంటూ అడిగాడు జాక్.

"ఇప్పుడేం వెతుకుతావులే చీకటి పడింది. రాత్రికిక్కడే పడుకొని రేపు మళ్లీ ప్రయాణించు" అంది ముసలావిడ.

"మరి నా గుర్రాన్ని, జాగిలాన్ని ఎక్కడ కట్టెయ్యను?"

"ఇదిగో, ఈ రెండు వెంట్రుకలతో వాటిని కట్టెయ్యి" అంటూ వెంట్రుకలిచ్చింది.

గుర్రాన్ని, జాగిలాన్ని కట్టేసి లోపలికి వచ్చిన జాక్‌తో, "నువ్వు నా ముగ్గురు కొడుకుల్ని చంపేశావు. నేనూ నిన్ను వదలను" అంటూ చేతులను బాక్సింగ్ గ్లవ్స్ తొడుక్కుంది ముసలావిడ. ఒక్కొక్క గ్లవ్ తొమ్మిది స్టోన్స్ (స్టోన్స్ అంటే పధ్నాలుగు పౌండ్లు) బరువుంది. వాటి మేకులు పదిహేను అంగుళాల పొడుగున్నాయి.

జాక్ పోరాడి అలసిపోయాడు. చివరిగా గుర్రానికీ, జాగిలానికీ కట్టిన వెంట్రుకలు అతడి గొంతుకు బిగుసుకుని చంపేశాయి. ముసలావిడ జాక్ మృతదేహాన్ని బయటికి విసిరేసింది. బిల్ తన ఇంట్లోని బావి నీటిని పరిశీలించి చూశాడు. పైన నీరు, కింద తేనె కనిపించాయి. జాక్ ప్రమాదంలో ఉన్నాడని గ్రహించి, మరో గుర్రం, జాగిలాన్ని తీసుకొని బయల్దేరాడు. దారిలో చూసిన వాళ్లందరూ అతడే జాక్ అనుకున్నారు. రాకుమారి కూడా బిల్‌ను చూసి, అతడే తన భర్త అనుకుని ఆహ్వానించింది. తెల్లారి గంటలతో జింక వచ్చింది. రాజు ఆదేశం ప్రకారం మళ్లీ వేట కొనసాగింది. బిల్ అడవిలో ఉన్న ముసలిదాన్ని చూశాడు. ఆవిడ ఇచ్చిన వెంట్రుకల్ని రహస్యంగా మంటలో వేసి తగలేశాడు. ముసలావిడ మళ్లీ బాక్సింగ్ గ్లవ్స్ తొడుక్కొని యుద్ధానికి సన్నద్ధమయ్యింది. కానీ ఈసారి వెంట్రుకలు సాయం చెయ్యలేదు. గుర్రం, జాగిలం వచ్చి ఆమెను తమ కాళ్లతో తన్ని రక్కి హింసించాయి.

"నన్ను చంపొద్దు. అక్కడ మూడు ఆకుపచ్చ రాళ్లున్నాయి చూడు. అవే నీ అన్న, గుర్రం, జాగిలం. ఈ మంత్రదండంతో తాకితే వాటికి ప్రాణం వస్తుంది" అంటూ వేడుకుంది ముసలావిడ. బిల్ స్పర్శతో రాళ్లకు ప్రాణం వచ్చింది.

జాక్ బిల్ కలిసి గుర్రం, జాగిలంతో తిరుగు ప్రయాణమయ్యారు. దారిలో ఇద్దరి మధ్య ఏదో వాదం జరిగింది. క్రితం రాత్రి బిల్ తన భార్యతో గడిపాడని తెలిసి జాక్ అతణ్ణి దూషించాడు. తనను అవమానించినందుకు కోపం వచ్చి జాక్‌ను మంత్రదండంతో కొట్టాడు బిల్. మరుక్షణమే జాక్ రాయిగా మారిపోయాడు. ఇంటికి చేరగానే జాక్‌కు ప్రాణభిక్షపెట్టమని రాకుమారి ప్రాధేయపడింది. బిల్ తన సోదరుణ్ణి తిరిగి బతికించాడు. ఆ తర్వాత ఇద్దరూ సుఖంగా జీవించారు.

ఓ మంచి పుస్తకం

తాపీ ధర్మారావు కొత్తపాళీ

-తెర

సంప్రదాయ కావ్యాలపై అపారమైన పట్టు వున్న వ్యక్తి గనక తాపీ వారు వాటిలోని పటాటోపాన్ని, అసంబద్ధతలను వైరుధ్యాలను శక్తివంతంగా ఎత్తి చూపిస్తారు. సామాజిక నేపథ్యంలో సాహితీ పరిణామాన్ని వివరిస్తారు. మొదట సాహిత్యం ప్రజల భాషలో అర్థమయ్యే విధంగా వుండేది. కాని కులీన వర్గాలు పైతరగతుల వారు దాన్ని కృతకంగా మార్చారు. సామాన్యులకు అంతుబట్టని విధంగా సంస్కృత భూయిష్టం చేశారు. అనవసర వ్యాకరణ సూత్రాలలో బంధించి వేశారు. యతి ప్రాసలు అందంగా వుంటాయంటారు. నిజమే. కాని వాటి కోసం ఎన్ని పాట్లు పడ్డారు? ఎన్ని వ్యర్థ పదాలను తెచ్చి నింపారు? కేవలం వ్యాకరణ అవసరాల కోసమే ఒరనర్, గావుత వంటి నిరర్థక పడికట్టు పదజాలం ఎలా పెరిగిపోయింది? అని ప్రశ్నిస్తూ, సోదాహరణంగా వివరించారు.

తెలుగు సాహిత్య పత్రికా రంగాలలో ఒక ప్రత్యేక స్థానం సంతరించుకుని అందరితో తాతాజీ అని పిలిపించుకున్న పితామహుడు తాపీ ధర్మారావు. అయితే తాతల నాటి భావాలలోనే చిక్కుకుపోకుండా నవీన మార్గాలను ఆహ్వానించిన దార్శనికుడు, పండితుడు, పరిశోధకుడు, అన్వేషి, సంస్కర్త ఆయన. కాలంతో పాటు మారగలిగిన వ్యక్తి మార్పు అవసరాన్ని గుర్తించి, వివరించగలిగిన పండితుడు.

1887 సెప్టెంబరు 19న అంటే 19వ శతాబ్ది చివరలో జన్మించిన తాపీ ధర్మారావు 1973లో కన్ను మూశారు. జీవితమంతా మూఢత్వాన్ని అన్ని రంగాలలో వ్యతిరేకించి పోరాడారు. మాటలకు రాతలకు పరిమితం కాకుండా ఆచరణలో అమలు జరిపారు. ఆ కాలంలోనే భార్యను చదివిస్తాననే షరతుపై పెళ్లి చేసుకున్నాడు. కుటుంబాన్ని ఛాందసాలకు అతీతంగా తీర్చిదిద్దుకున్నారు. కులాధిక్య సమాజ నియమాలను సవాలు చేశారు. తెలుగు జర్నలిజానికి కొత్త వరవడి పెట్టారు.

తాపీ ధర్మారావు రచనా వ్యాసంగం అత్యంత వైవిధ్య భరితమైంది. సంప్రదాయ సాహిత్యం నుంచి అభ్యుదయ యుగం వరకు ప్రత్యక్షంగా ప్రతిబింబించిన ప్రతిభామూర్తి ఆయన. చేమకూరి వెంకటకవి విజయ విలాసానికి హృదయోల్లాస వ్యాఖ్య రాసినా, టాల్‌స్టాయ్ మహత్తర రచన అనా కెరినినాను అనువదించినా ఆయన ప్రమాణాలు అత్యున్నతమైనవి. వేసిన దారంట వెళ్లిపోవడం వుండిపోవడం గాక నవ్యతను ఆహ్వానించడం ఆయన పద్ధతి. విమర్శనాత్మకంగా సమాచారాన్ని సేకరించడం, విశ్లేషణాపూర్వకంగా పరిశీలించి సరైన నిర్ధారణలు చేయడం తాపీ వారి శైలి. బహుశా ఆరుద్ర వంటి వారిని మినహాయిస్తే అన్యులెవరూ చేయలేనంత కృషి ఆయన చేయగలిగారు.

తాపీ ధర్మారావు తెలుగు పత్రికా రంగానికి చేసిన సేవ తగినంత గుర్తింపు పొందలేదని చెప్పాలి. ఆయన జనవాణితో పత్రికల తీరు తెన్నులను మార్చివేశారు. అప్పటి వరకు అమలవుతున్న వరవడిని ఛేదించారు. మొదటి పేజీ పైవరకు అడ్వర్టయిజ్‌మెంట్లు నింపడం వార్తలకు పొడుగ్గా లైన్ల కొద్దీ హెడ్డింగులు పెట్టడం వంటి పద్ధతులను మార్చివేశారు. 1936లోనే జనవాణితో పత్రికా భాషలో గ్రాంధికాన్ని తొలగించి వ్యవహారిక భాష ప్రవేశపెట్టారు. శీర్షికలలో వ్యంగ్యం, నైశిత్యం తెచ్చారు. తర్వాత కాలంలో తెలుగు పత్రికారంగానికి ఆద్యులుగా పరిగణించబడిన నార్ల వెంకటేశ్వరరావుతో సహా అనేక మంది ఆయన ఆధ్వర్యంలో పని చేసి అభివృద్ధి చెందినవారే. తాపీ వారి వ్యక్తిత్వం కూడా విభిన్నమైంది. స్వతహాగా ఆయన జస్టిస్ పార్టీ. అందుకే పిఠాపురం రాజా వారు ప్రారంభించిన జనవాణి పత్రికకు సంపాదకులయ్యారు. తర్వాత దశలో జనవాణి తనే నడిపారు. ప్రజాస్వామిక వాదిగా, స్వేచ్ఛా ప్రియుడుగా ప్రగతిశీల శక్తులకు చేయూత నిచ్చారు. కమ్యూనిస్టు పార్టీ నిషేధానికి గురైన కాలంలో ఆయన జనవాణి వారికి పరోక్షంగా తోడ్పడింది. ఆయన అభ్యుదయ రచయితల సంఘం తొలి మహాసభలకు అధ్యక్షత వహించడం కూడా యాదృచ్ఛికమేమీ కాదు.

తాపీ ధర్మారావు తన జీవిత కాలంలో అనేక సత్కారాలు, బిరుదులు పొందారు. అందులో ఆంధ్ర విశారద అనేది బాగా నిలిచిపోయింది. నిజంగానే ఆయన విద్యా విశారదుడు.

సామాజిక మార్పులకు సంబంధించి పెళ్ళి-దాని పుట్టుపూర్వోత్తరాలు, ఇనుప కచ్చడాలు, దేవాలయాల మీద బూతు బొమ్మలెందుకు? వంటి పుస్తకాలు రాసిన తాపీ వారు సమాజ గమనంలో మారే ఆచారాలను శాస్త్రీయంగా వివరించడానికి ప్రయత్నించారు. సాహిత్య సంబంధంగానూ అంతటి ప్రామాణిక గ్రంథాలు వెలువరించారు. కొత్తపాళీ, పాతపాళీ, సాహిత్య మొర్మొరాలు వాటిలో ముఖ్యమైనవి. వ్యవహారిక భాషకు గ్రాంధిక భాషకు మధ్య భీకర పోరాటం సాగిన ఆ కాలాన్ని గుర్తు చేసుకుంటే కొత్తపాళీ విశిష్టత అర్థమవుతుంది.

గిడుగు పండితుడు గురజాడ తోడుగా వ్యవహార భాష కోసం చేసిన పోరాటం విజయం సాధించినా ఛాందసశక్తులు అంత తేలిగ్గా దారికి రాలేదు. ప్రాచీన శైలిలో అర్థంకాని భాషలో రాస్తేనే గొప్ప అనే భ్రమలు పూర్తిగా వీడలేదు. అలాంటి తరుణంలో 1951లో తాపీవారు ఈ పుస్తకం రాశారు. ఇక్కడ ఇంకో విశేషం వుంది. విజయనగరంలో గిడుగు వారి సహచరులు, శిష్యులలో తాపీవారు కూడా ఒకరు. నిజానికి ఆయన గిడుగు దగ్గర ప్రత్యక్షంగా పాఠాలు చదువుకున్నారు. మొదట్లో ఈ గురు శిష్యులకు పడేది కాదట. తాపీ వారి బహుముఖ ప్రజ్ఞ గమనించిన తర్వాత గిడుగువారు ఆయనను అభిమానించిడం మొదలు పెట్టారు. అలాగే ప్రారంభంలో గ్రాంధికవాదగా వున్న తాపీ 1910లో గ్రాంధిక భాషావాదం అనే ఖండిక కూడా రాశారు. "మొదట నాది సనాతనమైన పిట్టకలం. పెద్దల నాటి రకం... ఇంతలో కొత్తకలాలూ కొత్త పాళీలూ వచ్చాయి. దేశ దేశాల్లోని కలాలు మారిపోయాయి. అభిమానాలు ఎలా కొట్టుకుంటున్నా మంచి చెడ్డలను తెలుసుకోవాలనే బుద్ధి నాది..." అంటూ కొత్తపాళీ ఆవిర్భావాన్ని వర్ణించారు. "కాలం మారిపోయినా మనం మారిపోకుండా వుండటం ఎంత అసంబద్ధమో మనం మారిపోయి కాలం మారిపోకుండా వుండడం అంతే అసంభవం. మనం ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా కాలం మారిపోయింది" అని ప్రకటించారు. మూడు సంవత్సరాలపాటు ఏమీ రాయకుండా కేవలం చదవడంపైనే కేంద్రీకరించి ఈ విషయాలను అధ్యయనం చేశానన్నారు. భాషకు సంబంధించి వివిధ దేశాలలో ముందుకొచ్చిన కొత్త పోకడలను గ్రాంథాలను చదివిన తర్వాత మన సాంప్రదాయక ఆలోచనా ధోరణిలో లోపాలు తెలియవచ్చాయని పేర్కొన్నారు. సంస్కృత

ప్రభావం దానితో ముడిపడి వున్న సామాజిక భావజాలం కారణంగానే ప్రాచీన కాలపు తెలుగు సాహిత్యం నిర్జీవంగా తయారైందని ఆయన నిరూపించారు. వ్యవహారిక భాషావాదానికి రావలసినంత ప్రచారం రాలేదని, సామాన్యులకు కూడా దాని గురించి తెలియడం అవసరమనే భావనతో ప్రత్యేకంగా ఈ రచన చేశానని ముందు మాటలో రాశారు.

చిన్న చిన్న వాక్యాలతో గొప్ప భావాలను స్ఫురింపజేయగల నేర్పు ఉన్న తాపీ వారు ఈ పుస్తకంలో ఇచ్చిన శీర్షికలు, ఉపశీర్షికలు, అర్థవంతంగానూ ఆకర్షణీయంగానూ అమరాయి. రచనా శైలి కూడా చురుక్కుమనిపించుతూ సాగిపోతుంది. "పాళీ అన్నా స్టీలు ముక్క అన్నా పేనా ముల్కి అన్నా అంతా ఒక్కటే - ఆత్మారాముడిలాగా దీనినే ఇంగ్లీషులో నిబ్ అంటారు. ఇప్పుడు కొత్తపాళీ అన్నా అన్ని జిల్లాల వారికి ఒక్కలాగా తెలుస్తుందనుకుంటాను" అని మొదట్లోనే ఇంగ్లీషు సాయంతో అర్థం వివరించడం ద్వారా ఆయన ప్రజలకు అర్థం కావడం ముఖ్యమనే అంశాన్ని స్పష్టం చేస్తారు.

సంప్రదాయ కావ్యాలపై అపారమైన పట్టు వున్న వ్యక్తి గనక తాపీ వారు వాటిలోని పటాటోపాన్ని, అసంబద్ధతలను వైరుధ్యాలను శక్తివంతంగా ఎత్తి చూపిస్తారు. సామాజిక నేపథ్యంలో సాహితీ పరిణామాన్ని వివరిస్తారు. మొదట సాహిత్యం ప్రజల భాషలో అర్థమయ్యే విధంగా వుండేది. కాని కులీన వర్గాలు పైతరగతుల వారు దాన్ని కృతకంగా మార్చారు. సామాన్యులకు అంతుబట్టని విధంగా సంస్కృత భూయిష్టం చేశారు. అనవసర వ్యాకరణ సూత్రాలలో బంధించి వేశారు. యతి ప్రాసలు అందంగా వుంటాయంటారు. నిజమే. కాని వాటి కోసం ఎన్ని పాట్లు పడ్డారు? ఎన్ని వ్యర్థ పదాలను తెచ్చి నింపారు? కేవలం వ్యాకరణ అవసరాల కోసమే ఒరనర్, గావుత వంటి నిరర్థక పడికట్టు పదజాలం ఎలా పెరిగిపోయింది? అని ప్రశ్నిస్తూ, సోదాహరణంగా వివరించారు.

కేవలం భాషలోనేగాక భావాలలో కూడా పాండిత్య ప్రదర్శన కోసం ప్రాచీన కవులు అసంబద్ధమైన ప్రయోగాలకు పాల్పడిన తీరును తాపీవారు తూర్పారపట్టారు. అంధానుకరణ కారణంగా నూతనత్వం అడుగంటి పోయిందని తేల్చారు. కుకవి నిందలో పెద్దన పద్యాన్ని ఉదహరించి మార్కండేయ పురాణాన్ని అనుకరించిన ఆయనకే ఇది ముందుగా వర్తించుతుందని నిస్సంకోచంగా ప్రకటించారు. వ్యాకరణ సూత్రాలను నిర్జించనవసరంలేదు. కాని భావ వ్యక్తీకరణకు అడ్డుపడే నాలుగైదు సూత్రాలను సవరించుకోకపోవడంవల్ల మొత్తానికే ఎసరు వచ్చిందని ఆయన వ్యాఖ్యానిస్తారు. బెంగాలీలు, తమిళులు కొన్ని ఇతర దేశాల వారి వలె మనం ముందుగా మేల్కొనక పోవడం తెలుగు వ్యాకరణం ప్రాణం మీదకు వచ్చిందని విచారం వ్యక్తం చేస్తారు.

పుస్తకం నాల్గవ అధ్యాయంగా "సూరి మరణం లేదా బండి రా పల్లకి" పేరిట రాసిన చిన్న ప్రహసనంలో ఆయన బాషా ఛాందసత్వం మృతి చెందడాన్ని హర్షించుతారు. ఆనాడు ప్రబలంగా వున్న వాదనలను అపహాస్యం చేస్తారు. ధృతం, శకటరేఫ, అరసున్నా బండి రా వగైరా ఆచరణలో లేని అక్షరాల అంత్యక్రియలు జరిగిపోయిన వైనాన్ని తమాషాగా చెబుతారు. యొక్క ... బడు వంటి ప్రయోగాలలో ఇబ్బందిని వెల్లడిస్తారు.

భావం కన్నా భాషకు ప్రాధాన్యతనివ్వడం అర్థరహితమని అంటూ తాపీ వారు ఇది దర్జీ వాదన అని అంటారు. అంటే మనిషి కన్నా అతను వేసుకునే దుస్తులకు విలువన్వివ్వడమన్న మాట. ఈ మాట అంటే ఇప్పటికీ వంటపట్టని వారిని చేసినపుడు ఆయన సునిశిత దృష్టి మనం గుర్తించగలుగుతాము.

భాషా ఛాందసానికి గల సామాజిక పునాదులను కూడా ఆయన విస్మరించలేదు. పైకులాల వారి ఆధిపత్యం వల్లనే అది బ్రతికి బట్ట కట్టిందని అంటారు. నన్నయ తర్వాత కాలంలో సమర్థులైన ఎందరో కవులు మంచి తెలుగు రాసినా ఉద్దేశ పూర్వకంగా దాన్ని వెనక్కు నెట్టారని వివరించారు. ఆఖరుకు పోతన అంతటి వాడిని కూడా మన పండితులు తేలిగ్గా ఆమోదించలేకపోరు. ప్రౌఢభాష లేని కవిత్వం గాసట బీసట అంటూ తేలిక చేశారు. కనుక పాల్కురికి సోమనాధుడు తదితర కవులు కూడా నిర్లక్ష్యానికి గురైనారు. కవయిత్రి మొల్ల ఈ పరిస్థితిపై ఆ కాలంలోనే తీవ్రమైన ఆవేదన, అభ్యంతరం వ్యక్తం చేసిన తీరును ఆయన ప్రస్తావించారు. ప్రబంధాలలో జీవం లేదని తేల్చేశారు. అంతేకాక కవి సమయాలు వగైరాల పేరిట సాగిన హాస్యాస్పద తతంగాలను సాధికారింగా విమర్శించారు. సామాన్యులకు కలిగే సందేహాలను ఆయన ప్రస్తావించుతారు. కాళిదాసు మాతా అంటూనే కుచోన్నతే అనడం, పోతన చనుకట్టు గురించి రాయడం ప్రస్తావించారు. ఆఖరుకు కుమారుడి అంత్యక్రియల కోసం వెళ్ళిన 80 ఏళ్ళ చంద్రమతిని వర్ణించేపుడు కూడా తరుణీమణి అని, గజగజేంద్ర సమానగామిని అని వర్ణించిన అనౌచిత్యాన్ని ఆయన తుత్తునియలు చేస్తాడు. అన్ని వేళలా స్త్రీని ఒకే దృష్టితో చూసే దౌర్భాగ్యం వల్లనే ఈ దుస్థితి ఏర్పడిందని అంటారు.

స్త్రీ గురించి ప్రస్తావించడంలో తాపీ వారు ఒక గొప్ప సామాజిక సత్యాన్ని సాహిత్య కోణం నుంచే విశ్లేషించారు. తెలుగు దేశంలో వున్న స్త్రీల కన్నా స్త్రీని వర్ణించే పదాలు ఎక్కువ. ఆమె ఒకో అవయవాన్ని ఆధారంగా చేసుకుని ఒకో మాట కనిపెట్టారని వ్యాఖ్యానించారు. అదే పురుషుని గురించి చెప్పాలంటే నాలుగైదు. మాటల తర్వాత తడుముకోవలసిదే. ఇది నాటి కవుల దృష్టిని ప్రతిబింబించుతుంది. అయితే ఇలాటి అనౌచిత్యాలను సవివరంగా పేర్కొంటూనే తనకు ప్రాచీన సాహిత్యంపట్ల అగౌరవం లేదని, దాన్ని చదవాల్సిందేనని చెప్పడం ఆయన వాస్తవిక దృష్టికి నిదర్శనం. ఉన్నంతలో జాగ్రత్తగా రాసిన కవుల గురించి కూడా ప్రత్యేకంగా తెలిపారు.

'సాహిత్యంలో జాతి జీవితం ప్రతిబింబించాలి' అనేది ఈనాడు లోకం అంగీకరించిన సూత్రం. ఈ సూత్రానికి అనుగుణంగా వుండాలంటే కవి ప్రజలలో ప్రజలతో బ్రతకాలి. ప్రజల జీవితం గ్రహించాలి. దానిలోని చెడుగును నిర్మూలన చేయదానికి మంచిని పెంచదానికి తన శక్తిని ఉపయోగించాలి. జీవితానికి వికాసం కలిగించాలి. దానిని అభ్యుదయ మార్గంలో నడిపించడం ప్రతి వ్రాతగాడికి ప్రధానమైన పని అని చివర్లో ఆయన ఇచ్చిన సందేశం.

తాతాజీ తను చెప్పిన మార్గంలోనే పద్యాలు, గేయం కూడా రాసి జత చేయడం ఈ పుస్తకానికి కొసమెరుపు. ఆనాటికే మహాప్రస్థానం వంటివి వచ్చేసిన మాట నిజమే అయినా సనాతన కాలంలో పుట్టి సాంప్రదాయం నుంచి సంస్కరణవైపు వచ్చిన తాపీ వంటి వ్యక్తి ఈ మాట చెప్పడంలో ఒక ప్రత్యేకత వుంది. ఛందస్సుల సర్ప పరిష్వంగాలు వీడి, నిఘంటువుల శ్మశానాలు దాటి తెలుగు సాహిత్య ప్రస్థానం కదం తొక్కుతున్నదనే సత్యాన్ని ఆయన కవితాత్మకంగా వర్ణించారు.

గొంతులో ఒక యగ్ని
కొత్తగా రగిలింది
తంత్రులన్నీ ఒక్క పుంతలో బద్దలాయి
ఇంతింత అనరాని వంత బలమొచ్చింది.
స్వార్థ గానము మానరా
ఓ కవి
సార్థకానికి పూనరా!
ప్రజల కవివై గొంతు
రగిలించి పాడితే
ఒక్క డొక్కలు రేగి ప్రళయ మారుత మట్టు
తక్కువెక్కువలెల్ల ఒక దెబ్బను కూల్చి
లోకాల నూగించవా
ఓ కవి శోకాల తొలగించవా!

ఈ చరణాలతో ముగిసే కొత్తపాళీ నిజంగానే కొత్త గొంతులకు కొండంత బలం చేకూర్చింది. గురజాడ అన్నట్టు భాషలో ప్రజాస్వామ్యం ఆధునిక యుగ లక్షణం. ప్రజాస్వామికవాది, ప్రగతి పథగామి, అన్వేషి అయిన తాపీ ధర్మారావు కొత్తదనాన్ని నిర్వచించి కొత్త భావాలను నిర్దిష్టపరచే కృషి చేయడం సహజ పరిణామమే. భాషా కోణం నుంచి మాత్రమే గాక పాత సాహిత్యాన్ని సవిమర్శకంగా తెలుసుకోవాలనుకునే వారికి కూడా ఈ గ్రంథం దిక్సూచిగా ఉపయోగపడుతుంది. బ్రతికి వుండి చనిపోవడం, చనిపోయి బతకడం అనే ప్రయోగాల గురించి తాపీ వారి ఇలాంటి రచనల ద్వారా నిస్సందేహంగా చిరస్మరణీయులుగా వుండిపోతారు.

పండిట్ గంగారాం

బీర్బల్ కథలు

కనిపించిందా...

హాయ్ ఫ్రెండ్స్... ఇక్కడొక పుస్తకాల అలమరా ఉ
కదూ. అందులోనే మనిషి ఆకారం కూడా ఉం
కనిపించిందా.

అతికిద్దామా!



హాయ్ ఫ్రెండ్స్.... ఇక్కడ నాలుగు చిన్న ముక్కలు ఉన్నాయి చూశారుగా. వాటిని అతికించి ఇంగ్లీషు 'టి' అక్షరం చేయాలి.



పిల్లులెన్ని?

హాయ్ చిన్నారులూ...ఏంటి? ఇక్కడ పులి త
కనిపిస్తుంటే పిల్లులంటారేంటి అనుకుంటున్నా
కాస్త పరిశీలనగా చూడండి. పిల్లులు కొన్ని
కనిపిస్తాయి. అయితే అవి మొత్తం ఎన్నో చెప

సుడోకు చేస్తారా?

హలో బుజ్జాయిలూ...మీరు లెక్కలు బాగా చేస్తారు కదా. కిందున్న సుడోకు పజిల్‌ను చకచకా చేయండి. మీరు ఏంచేయాలంటే దానిలో నిలువుగా, అడ్డంగా గడులున్నాయిగా. వాటిలో 1 నుండి 6 వరకు అంకెలు వేయండి. అయితే ప్రతి వరుసలోనూ ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. తర్వాత మా జవాబుతో సరిచూసుకోండే.

2	1			4	3
		6	2		
		3	4		
3	4			5	6

చుక్కలు కలిపేద్దాం



నిజమేనా...

హాయ్ ఫ్రెండ్స్... ఈ బొమ్మలో ఒక అమ్మ, పాప నమస్కరిస్తున్నట్టు కనిపిస్తున్నారా! అయితే ఇందులో కొండలు, నది, చెట్లు... చాలా వున్నాయి. ఏంటి నమ్మకం లేదా. ఇంకా అర్థం కాకపోతే జవాబు చూడండి.

నేర్చుకుందామా!



జవాబులు:

<u>పిల్లులెన్ని?</u>: మొత్తం పిల్లులు ఏడు.

<u>కనిపించిందా...</u>: ఆ పుస్తకాల అల్మారాలో కింది నుంచి పైకి చూస్తే మనిషి కాళ్లు కనిపిస్తాయి.

<u>నిజమేనా</u> : పుస్తకాన్ని కుడిచేతివైపు తిప్పి చూస్తే సరి.

<u>అతికిద్దామా!</u> :



<u>సుడోకు</u> :

2	1	5	6	4	3
6	3	4	5	1	2
4	5	6	2	3	1
1	2	3	4	6	5
5	6	1	3	2	4
3	4	2	1	5	6

అట్టమీది కథ

చిన్న చిత్రాలదే చిద్విలాసం

2007 సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డు పొందిన చిత్రాలలో ఒక విశేషం వుంది.. బంగారు నంది పొందిన 'మీ శ్రేయోభిలాషి'. ద్వితీయ ఉత్తమ చిత్రం 'హ్యాపీ డేస్'. తృతీయ ఉత్తమ చిత్రం 'లక్ష్యం'. కుటుంబ సమేతంగా చూడదగిన చిత్రం 'చందమామ'. ఆఖరులో పేర్కొన్న ఈ చిత్ర దర్శకుడు కృష్ణ వంశీనే ఉత్తమ దర్శకుడి అవార్డు కూడా వరించింది.అలాగే ఆ చిత్రంలో నటించిన ఆహుతి ప్రసాద్ ఉత్తమ సహాయనటుడుగా వచ్చాడు. ఉత్తమ నటిగా ఛార్మి 'మంత్ర' చిత్రంతో ఎంపికైంది. సందేశాన్ని బట్టి, విజయాన్ని బట్టి పెద్దవే అయినా సినిమా భాషలో ఇందులో ఎక్కువ భాగం చిన్న సినిమాలే.ఇవే కాదు, గత కొన్నేళ్లలో చడీ చప్పుడు లేకుండా విడుదలై జయజయ ధ్వానాలందుకున్న చిన్న చిన్ని బొమ్మలెన్నో వున్నాయి- ఐతే, గమ్యం, ఉల్లాసంగా ఉత్సాహంగా, అష్టాచెమ్మా, అంతకు ముందు దేవదాసు, ఢీ, ఇంకా ముందు చిత్రం, జయం, నువ్వేకావాలి ఇలా ఈ జాబితా చాలా వుంది.

- తెలకపల్లి రవి

2007లో మొత్తం 138 చిత్రాల నిర్మాణం జరిగితే ఇందులో పది అగ్రహీరోలవి. వీటిపై రు.350 కోట్లు ఖర్చు చేశారు. ఇంత ఖర్చు చేసినా అందులో మూడు నష్టాలు చవిచూశాయి. 2008లోకి వచ్చే సరికి 150 చిత్రాలు తీస్తే ఇందులో పెద్దహీరోలతో ఏడంటే ఏడే వున్నాయి.సంఖ్య తగ్గింది కాని నిర్మాణ వ్యయం మాత్రం ఒకో దానికి రు.30-40 కోట్ల వరకూ కావలసి వచ్చింది.అన్నీ పెద్ద విజయవంతమైనవి కావు.తక్కిన చిత్రాలను మూడు నుంచి నాలుగు కోట్ల ఖర్చుతో తీశారని అంచనా. వీటిలో 14 వరకూ విజయం సాధించాయి. అంటే పెద్ద హీరోల చిత్రాల సంఖ్యకు రెట్టింపుగా ఇతరులు చిత్రాలు విజయవంతమైనాయి. ఇదే తెలుగులో అనివార్యంగా పెరుగుతున్న కొత్త ధోరణికి అద్దం పడుతున్నది.

చిన్న చిత్రాలంటే నిర్వచనం ఏమిటి? మామూలుగా చిత్రాల ప్రెస్‌మీట్‌లలో ఖర్చుకు వెనకాడకుండా తీయడం గొప్ప విషయమైనట్టు చెబుతుంటారు. అగ్రనటీనటులు వుంటే ముందు వారి పారితోషికాలకే సగం పైగా కేటాయించాలి. అంత ఖర్చు చేసిన తర్వాత దాన్ని విజయవంతం చేసుకోవడానికి తప్పక అనేక ఆకర్షణలు జోడించాలి. ఆ నటులే గొప్ప ఆకర్షణ అని వెంటపడి ఒప్పించుకున్న నిర్మాతలకు ఇదేం విడ్డూరంగా కనిపించదు.ఎందుకంటే అగ్ర తారల చిత్రాలకు 'ఓపెనింగ్స్' బాగుంటాయని ఒక నమ్మకం(నమ్మకం మాత్రమే). చిత్రం ఫెయిలైనా నిర్మాతకు నష్టం రానివ్వని వారే బాక్సాఫీసు హీరోలని ఒక నిర్వచనం. నిజానికి అదికూడా పూర్తి నిజం కాదు. నిర్మాత కాకపోతే దాన్ని కొనుగోలు చేసిన బయ్యర్లు నష్టపోతారు. భారత దేశపు సూపర్‌స్టార్ రజనీకాంత్ సైతం 'బాబా' చిత్రం విఫలమైన తర్వాత బయ్యర్లను పిలిచి మరీ అడ్వాన్సులు వెనక్కు ఇచ్చిన సంగతి తెలిసిందే.అలాగే పవన్ కళ్యాణ్ 'జానీ' విషయంలోనూ జరిగింది. ఇటీవల బాలకృష్ణ 'ఒక్కమగాడు', చిరంజీవి 'జై చిరంజీవ' వంటి చిత్రాలు ఇలగే నిరాశపర్చాయి. అయినా అగ్రనటుల చిత్రాలను చూసేందుకు అభిమానులు మొదటి రోజు విరగబడతారని విశ్వాసం. ఒకవేళ ఏమాత్రం బాగుండి విజయవంతమైనా కనక వర్షమే. కనుకనే నిర్మాతలు వారి వెంటబడుతుంటారు.అడ్వాన్సులు వచ్చి ప్రదిక్షిణలు చేస్తుంటారు.

కాని ఇందులో చాలా సమస్యలు. ఎంత పెనుగులాడినా ప్రముఖ తారలు అందరి చిత్రాల్లో చేయలేరు.ఒకప్పుడు ఎన్టీఆర్, ఎన్నార్, తర్వాత కృష్ణ,శోభన్ బాబు, కృష్ణంరాజు వంటి వారు వందలాది చిత్రాల్లో నటించేవారు. ఫలితంగా నిర్మాతలకు ముందో వెనకో అవకాశం దక్కేది. కాని ఇటీవల ఈ పరిస్థితి తారుమారైంది. విజయానికి చిరునామాలని చెప్పుకునే హీరోలూ కూడా వేళ్లమీద లెక్కపెట్టదగినన్ని చిత్రాలకే పరిమితమవుతున్నారు. ఏడాదికి ఒక చిత్రం విడుదలైతే గొప్ప అంటున్నారు.ఏడాది రెండేళ్ల పాటు మొహానికి రంగు పూసుకొని తెరపై కనిపించని సందర్భాలుంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అనివార్యంగా ఇతర తరహా చిత్రాల అవసరం పెరుగుతుంది. గతంలో వలె ప్రేక్షకులు ఒకే హీరోను ఆరాధిస్తూ ఇతరులను నిరాదరించే పరిస్థితి పోవడంతో కొత్త వారితో ప్రయత్నం, ప్రయోగం చేద్దామనే భావనకు బలం చేకూరుతున్నది. పెద్ద హీరోలతో భారీ ఎత్తున తీసినా విజయానికి పూచీ లేనప్పుడు చిన్న తారలతో భిన్న చిత్రాలు తీసి చూద్దామనుకునే నిర్మాతలు, దర్శకుల సంఖ్య పెరుగుతున్నది. ఇన్ని కారణాలు కలగలసి చిన్న హీరోలు,చిన్న చిత్రాల పంథా లోతుగా వేళ్లూనుకుంటున్నది. మరే ఇతర హీరో కన్నా ఎక్కువగా అల్లరి నరేష్ అత్యధిక చిత్రాల్లో నటించడం ఈ ధోరణికి తిరుగులేని నిదర్శనం.



చిన్న చిత్రమంటే...?

చిన్న చిత్రం అన్న దానికి ఇదమిద్ధమైన నిర్వచనం చెప్పడం చాలా కష్టం. ఒకరకంగా పెద్ద హీరోలు లేనివన్నీ చిన్న చిత్రాలే. మొదట్లో ఎన్టీఆర్ ఏఎన్నార్‌లు, తర్వాత వచ్చిన ముగ్గురు హీరోలు నటించినవాటిని గాక ఇతరమైనవాటిని ఈ జాబితాలో చెప్పుకునే వారు. ఇప్పుడు నరేష్, నవదీప్, వరుణ్ వంటివారిలాగే ఒకప్పుడు చంద్రమోహన్,శ్రీధర్ నరేష్, రాజేంద్రప్రసాద్ వంటి వారితో తీసిన చిత్రాలను ఈ కోవలో చెప్పుకునేవారు. మెగాస్టార్ చిరంజీవి కూడా పునాదిరాళ్ళు, ప్రాణం ఖరీదు వంటి వాటిలో నటించినపుడు ఈ జాబితాలోనే వుండేవారు. ఆ మాటకొస్తే తేనెమనసులులో ఆదుర్తి సుబ్బారావు కృష్ణను అలాగే ప్రవేశపెట్టారు. చిన్నగా ప్రవేశించి పెద్ద తారలుగా ఎదిగిన వారిలో ఈ ఇద్దరినే ముందు చెప్పుకోవాలి. దర్శకులలోనూ బాపు, దాసరి, రాఘవేంద్రరావు, కృష్ణారెడ్డి తదితరులందరూ అలా పెద్ద వారైపోయారు(బాక్సు చూడండి). చిన్న చిత్రాలు పెద్ద చిత్రాలకు సోపానాలుగా భావించే ధోరణి ఎప్పుడూ వుంటుంది. ఎందుకంటే విజయాలు పారితోషికాలు పెంచుతాయి. దాంతోపాటే నిర్మాణవ్యయం పెరుగుతుంది.మళ్లీ కొత్తవారికై అన్వేషణ. అలాగే హాస్యనటులతో తీయడం మరో పద్ధతి. పద్మనాభం,చలం, రాజబాబుల నుంచి అలీ వరకూ విదూషక పాత్రధారులతో హీరోలుగా చేయించి విజయాలు సాధించిన ఉదాహరణలున్నాయి. ఇదే కోవలో బాల పాత్రలు ప్రధానంగా తీసుకున్న చిత్రాలు(బాలరాజుకథ, పాపం పసివాడు, భలేపాప, పాపకోసం, భద్రం కొడుకో వంటివి) స్త్రీ పాత్ర ప్రధానంగానూ చిన్న చిత్రాలు చాలా వచ్చి విజయం సాధించాయి. సాధారణ వ్యాపార ఫార్ములాలో ఒదగని ప్రగతిశీల చిత్రాలు కూడా చిన్న తారలతో భిన్న శైలిలో వస్తాయి. ఒకప్పుడు ప్రభాకర రెడ్డి, తర్వాత మాదాల రంగారావు, ఇటీవల నారాయణ మూర్తి తీసే చిత్రాలు ఇందుకు ఉదాహరణలు.



ఇతివృత్తాలను బట్టి చిన్న చిత్రాలను సమాంతర చిత్రాలని, ఖర్చును బట్టి బడ్జెట్ చిత్రాలని అంటుంటారు. వ్యాపార ఫార్ములాకు భిన్నంగా వుంటాయి గనక సమాంతరమైనవి. ఆచితూచి ఖర్చు చేస్తారు గనక లోబడ్జెట్ చిత్రాలు అవుతాయి. ఇంతకూ చిన్న చిత్రమంటే కనిష్టం మూడు ప్రింట్ల నుంచి75 ప్రింట్ల వరకూ వుండొచ్చు. ఖర్చు విషయానికి వస్తే రు.50 లక్షల నుంచి రెండు మూడు కోట్ల వరకూ వెచ్చించవచ్చు.పెద్ద చిత్రం భారీ బడ్జెట్లతో ఫైనాన్షియర్ల సహకారంతో అట్టహాసంగా విడుదలవుతుంది. తీసేవారు కూడా మోతుబరి ఆసాములై వుంటారు. ఇందుకు భిన్నంగా పరిమితమైన నిధులతో సినిమా రంగంపట్ల అభిరుచితో వచ్చేవారు లోబడ్జెట్ చిత్రాలు తీస్తారు. వీటిలో నటించేవారు ద్వితీయశ్రేణి హీరోలై వుండొచ్చు. లేదా మరీ కొత్తవారు కూడా కావచ్చు. వీటికి విడుదలకు ముందు పెద్ద ఆర్భాటం వుండదు. చేసినా ఎవరూ పట్టించుకోరు. ఎందుకంటే అందులో నటించే వారు మరీ ప్రసిద్ధులుకారు కనక. కాని విడుదలైన తర్వాత మాత్రం వాటి పేరు మోత మోగిపోవచ్చు. అగ్ర హీరోల చిత్రాలనూ అధిగమించవచ్చు.



అన్ని సినిమాలూ ఒకేలా వుండవ్!

ఈ కాప్షన్‌తో పోస్టర్లు వదిలిన చిత్రం గుర్తుందా? అప్పుడే ఆ ఆనందానుభూతి మర్చిపోయారా? అదే నండీ.. ఐతే... గుణం గంగరాజు చిత్రం పోస్టర్లలో నటీనటుల మొహాలు కూడా కనిపించని ఆ చిత్రం విడుదల తర్వాత అదే పనిగా ఆడింది.నలుగురు యువకులు, ఒకమ్మాయి కలసి చేసిన కిడ్నాప్ ప్రహసనం ఎంతగానో ఆకట్టుకుంది. తర్వాత చెప్పుకోవలసింది 'చక్కటి కాఫీలాంటి చిత్రం 'ఆనంద్'. నేరము శిక్ష అన్న పాత పాయింటునే కొత్తస్పర్శతో అందించిన దర్శకుడు శేఖర్ కమ్ముల తర్వాత 'గోదావరి', ఇటీవల 'హ్యాపీడేస్'తో ఆ ముద్రను నిలుపుకొన్నారు. ఇక మరో ప్రతిభావంతుడు ఇంద్రగంటి మోహన కృష్ణ 'గ్రహణం'తో జాతీయ అవార్డు పొందినా తర్వాత 'మాయాబజార్'తో నిరుత్సాహపర్చారు. ఆ కొరత తీరుస్తూ 'అష్టాచెమ్మా'తో అదరహో అనిపించారు. ఇంతా చేసి చిత్రంలో వున్న అంశం చాలా చిన్నదే. ఈ

చిన్న చిత్రాలు కాలూనేందుకే

దాసరి నారాయణరావు,బాపు,రాఘవేంద్రరావు, తేజ, పూరి జగన్నాథ్... ఇలా ఏ దర్శకుణ్ణయినా తీసుకోండి. మొదట చిన్న చిత్రాలతోనే పరిశ్రమలో కాలూనిన వారే. దాసరి మొదటి చిత్రంలో హీరో రాజబాబు కాగా మరో ముఖ్యపాత్రధారి సత్యనారాయణ. అసలు ప్రాణ ప్రతిష్ట చేసింది తాతగా నటించిన ఎస్వీఆర్ ఆయన సరసన అంజలీ దేవి. మొదటి చిత్రమే సూపర్ హిట్టవడంతో ఆయన తర్వాత ఎక్కడికో వెళ్లిపోయారు. తర్వాత కూడా కొన్ని విభిన్న చిత్రాలు కొంత కాలం తీసినా తర్వాత భారీ బడ్జెట్లే. అయితే 'నీడ, అమ్మ రాజీనామా' వంటి వాటితో తర్వాత కూడా కొంత ప్రత్యేకత చూపించారు. ఇక విశ్వనాథ్ మొదట్లో పెద్ద తారలతోనే తీసినా అప్పుడు ఇంత ప్రత్యేక వ్యక్తిత్వం సంతరించుకోలేదు. చంద్రమోహన్, రోజారమణితో 'ఓ సీత కథ' తీశాకే తనదైన ముద్ర వచ్చింది. తర్వాత దశలో 'మాంగల్యానికి మరోముడి, సిరిసిరిమువ్వ' వంటివి. 'శంకరాభరణం' కూడా పెద్ద చిత్రమే కాని తారాబలం తక్కువ. అయితే తర్వాత ఆయన కూడా కమల్‌హాసన్, చిరంజీవి, వెంకటేష్ వంటివారితో తీస్తూ చివరకు తనే నటించడం మొదలెట్టారు. ఇక రాఘవేంద్రరావు అనగానే జయసుధతో తీసిన 'జ్యోతి, కల్పన' వంటివి గుర్తొస్తాయి. 'అమరదీపం' తో మొదలై ఆ పైన భారీమార్గం. బాపూ రమణ ద్వయం కృష్ణ, విజయనిర్మలతో తీసిన 'సాక్షి' విలక్షణ ప్రయోగం. అలాగే 'బంగారు పిచుక'. తర్వాతి దశలో 'ముత్యాల ముగ్గు'. నెమ్మదిగా వారూ భారీ బాట పట్టారు. అయితే ఈ దశలో సాధించిన విజయాలు తక్కువ. ఎస్వికృష్ణారెడ్డి మొదట్లో తీసినవన్నీ వినోద ప్రధానమైన చిన్న చిత్రాలే. వంశీ సరే సరి. ఎటొచ్చి వీరంతా కాస్త నిలదొక్కుకోగానే పెద్ద తారలు సాపేక్షంగా భారీ బడ్జెట్లలో పడిపోతారు. అది తమ తప్పు కాదని ప్రేక్షకులు నిర్మాతల కోసమే అలా చేస్తున్నామని అంటారు.

కోవలో మరో ఘన విజయం దిల్‌రాజు 'కొత్త బంగారు లోకం'... విద్యార్థుల అల్లరి ప్రధానాంశంగా అంతకు ముందు చాలా చిత్రాలు వచ్చాయి గాని వాటిలో గుర్తించని అంశాన్ని దిల్ రాజు దీంట్లో నేర్పుగా పట్టుకున్నారు. అదేమంటే ఇదివరకటిలా ప్రభుత్వ కాలేజీలు గాక గట్టి నియంత్రణలో నడిచే ప్రైవేటు కాలేజీల వ్యవస్థను చిత్రించడంతో నిజంగానే కుర్రకారుకు కొత్త బంగారు లోకం అనిపించింది. ఇంతా చేసి అది ఇంటర్ మీడియట్ లౌ స్టోరీ మాత్రమే. కాకపోతే గతంలో ఘన విజయం సాధించిన 'బొమ్మరిల్లు'లో కోటీశ్వరుడైన హిట్లర్ తండ్రిగా నటించిన ప్రకాశ్ రాజునే ఇందులో మంచి మనసుగల మధ్య తరగతి తండ్రిగా వేయించి చూడ ముచ్చటగా వుండే కుర్ర హీరో హీరోయిన్లను పెట్టి నిర్మాత దర్శకులు సక్సెస్ కొట్టేశారు. పారితోషికం పెంచకుండా చిన్న నిర్మాతలకు వర ప్రసాదంగా వున్న అల్లరి నరేష్ 'బ్లేడ్ బాబ్జీ, సిద్ధు ఫ్రం శ్రీకాకుళం' వంటి చిత్రాలతో భద్రతనిచ్చారు. అతనే 'గమ్యం'లో మరో మంచిపాత్రకు ప్రాణం పోసి విజయానికి కారకుడైనాడు..సిద్ధార్థుడు బుద్ధుడుగా మారడం అనే పాత ఫార్ములాను పట్టుకుని క్రిష్ కొత్త దర్శకుడైనా శర్వానంద్, నరేష్‌లతో ఆ చిత్రాన్ని చక్కగా మలచి భేషనిపించుకున్నారు. స్థూలకాయుడైన హీరోగా, హ్యాపీడేస్ ఫేం నాయికగా వచ్చిన వినాయకుడు కూడా ఈ కోవలోనే విజయవంతమైంది.

వాస్తవం ఏమంటే ఎప్పుడూ లేబ్రాయపు ప్రేమ కథా చిత్రాలు చక్కగా తీస్తే విజయానికి భరోసా వుంటుంది. 'ప్రేమ ఖైదీ, ముద్దమందారం' వంటివి ఒకప్పుడు అలాగే విజయం సాధించాయి. 'నువ్వే కావాలి' కూడా పెద్ద తారాబలం లేకుండానే విజయం సాధించి నువ్వే చిత్రాలకు నాంది పలికింది. తరుణ్‌ను హీరోను చేసింది. అలాగే 'మనసంతా నువ్వే' ఉదయ కిరణ్‌ను తెరపైకి తెచ్చింది. వీరందరి యువ ప్రేమ చిత్రాలు కొంత కాలం నడిచినా కొద్ది కాలంలోనే ఆ ధోరణి మారింది. ఇలాంటి చిత్రాల నటీనటులు కథను, కాలాన్నిబట్టి తప్ప శాశ్వతంగా నిలవడం కష్టమేనని హిందీ చిత్ర రంగాన్ని చూసినా అర్థమవుతుంది.

అంతకు ముందు కాలంలో కామెడీ కింగ్‌గా కల్పతరువైన రాజేంద్ర ప్రసాద్ గత కొన్నేళ్లలో భిన్నమైన పాత్రలతో అలరించి స్థానం నిల్పుకోవడం విశేషమే. 'ఆ నలుగురు, మీ శ్రేయోభిలాషి' చిత్రాలలో ఆయన తన నట విశ్వరూపాన్ని చూపించారు.తమాషా ఏమంటే మంచివాడైన 'ఆ నలుగురు' హీరో ఆత్మహత్య చేసుకుని చనిపోగా 'మీ శ్రేయోభిలాషి' అసలు ఆత్మహత్యలను నివారించడానికే అంకితమైన మనిషి. సమాంతర ఇతివృత్తాలు ఇలాగే వుంటాయి.ఐతే దర్శకుడు గుణం గణ్ణంరాజు అత్యంత అభినందనీయమైన ఇతివృత్తంతో 'అనుకోకుండా ఒకరోజు' తీశారు గాని అది కావలసినంత విజయవంతం కాలేదు.

పెరుగుతున్న వయసుతో పెరిగే వేగాన్ని అందుకోలేని అగ్రతారలు చిత్రాల సంఖ్య తగ్గించుకోగా స్తోమత గల నిర్మాతలు ద్వితీయశ్రేణి హీరోలతోనే భారీగా చిత్రాలు తీసిన ఉదాహరణలు కూడా చాలా వుంటున్నాయి.ఉదాహరణకు సంక్రాంతికి తయారైన కొన్ని చిత్రాలు చూస్తే ఈ సంగతి తెలుస్తుంది(అయితే వీటిలో కొన్ని విడుదల కాలేదు). నితిన్ ప్రియమణిలతో తీసిన 'ద్రోణ' కు ఆరు కోట్లు ఖర్చయితే నరేష్,మదాలసశర్మలతో తీసిన 'ఫిటింగ్ మాస్టర్'కు 4.5 కోట్లు ఖర్చు పెట్టారు. తరుణ్ జెనీలియాలతో తీసిన 'శశిరేఖా పరిణయం' కోసం కృష్ణవంశీ రు.7కోట్లు ఖర్చు చేయించారు. త్రిష,ప్రకాశ్ రాజ్‌లతో తమిళం నుంచి డబ్బింగ్ చేసిన 'ఆకాశమంత'కు రు.4.5 కోట్లు ఖర్చుచేశారు. ఇవన్నీ కూడా పెద్ద హీరోలు లేని చిత్రాలే. అయితే ఇవి చిన్న చిత్రాల కోవలోకి రావు. అయితే మారుతున్న ధోరణిని ఇవి కూడా ప్రతిబింబిస్తున్నాయి. 'మంత్ర, అరుంధతి' వంటి చిత్రాలను భారీ వ్యయంతో రూపొందించడం కూడా కొత్త ధోరణినే చూపిస్తుంది.

మళ్లీ చిన్నచిత్రాల విషయానికి వస్తే అగ్రశ్రేణి హీరోలు ఎప్పుడూ అరడజను మంది కూడా వుండరు. మొదటి తరంలో ఇద్దరు, తర్వాత కలసిన ఇద్దరు, ఆ పైన మరొకరు- వీరంతా డెబ్బయ్యవ దశకంలోపు వారే. ఎనభైలలో ఒక్క చిరంజీవి మాత్రమే ఈ జాబితాలో కలిశారు. మిగిలిన వారికి ఎన్ని ఘన విజయాలున్నా, వైవిధ్యభరితమైన పాత్రలు వేసినా పై జాబితాలో చోటు సంపాదించలేదని చెప్పొచ్చు. రవితేజ, గోపీచంద్, శ్రీకాంత్ వంటివారు కూడా స్థానం సంపాదించుకున్నా పెనుగులాట తప్పడం లేదు. చిరంజీవి


బాపు


దాసరి


శేఖర్ కమ్ముల

ఆరోగ్యం మెదడులో కణుతులు

శరీరంలోని ఇతర అవయవాల్లోకెల్లా మెదడు చాలా ముఖ్యమైన అవయవం. సున్నితమైనదీను. ఇది శరీరంలో అన్ని భాగాలను నియంత్రిస్తుంది. మెదడుకు వచ్చే వ్యాధులను అశ్రద్ధ చేస్తే ప్రాణాపాయం సంభవించే అవకాశముంది. ఆ వ్యాధుల్లో మెదడులో ఏర్పడే కణితి ఒకటి. దీన్నే బ్రెయిన్ ట్యూమర్ లేదా బ్రెయిన్ క్యాన్సర్ అంటారు. అసలు ఈ వ్యాధిని నిర్ధారించడం ఎలా? ఏమేం పరీక్షలు చేస్తారు? లక్షణాలేంటి? చికిత్స ఏంటి? వంటి విషయాలు ఈ వారం తెలుసుకుందాం.



డా॥ వేమూరి నాగశంకర్,
న్యూరో సర్జన్,
రాఘవేంద్ర సూపర్ స్పెషాలిటీ న్యూరో సెంటర్ మరియు ఎమర్జెన్సీ హెడ్ ఇన్‌జ్యూరీ కేర్,
కొత్తపేట, నెహ్రూనగర్ రోడ్, గుంటూరు.
సెల్: 9247862689

మెదడులో ఏర్పడే కణుతుల్లో కొన్ని అతి వేగంగా, మరికొన్ని నెమ్మదిగా పెరుగుతాయి. వాటి లక్షణాలేంటో చూద్దాం.



లక్షణాలు

తలనొప్పి, వాంతులు, ఫిట్స్, పక్షవాతం (ఒక కాలు చేయి పడి పోవటం లేదా చూపు మందగించడం) వంటి లక్షణాలు కనిపిస్తాయి. వీటిలో ఏవైనా రెండు లేదా మూడు లక్షణాలు ఉండొచ్చు లేదా అన్ని లక్షణాలు ఉండొచ్చు. వేగంగా పెరిగే కణితిలో ఈ లక్షణాలు త్వరితంగా వస్తాయి. అతి నెమ్మదిగా పెరిగే కణితిలో పైన వివరించిన లక్షణాలు ప్రారంభదశలో ఉండకపోవచ్చు. దీర్ఘ కాలికంగా వచ్చే తలనొప్పి కాని, క్రమేణా చూపు మందగించడం కాని తరచూ వాంతులు రావటం ద్వారా ఫిట్స్ రావటం కాని, లేదా జ్ఞాపకశక్తిలో తేడా కాని, లేదా మనిషి ప్రవర్తనలో ఆకస్మిక మార్పులు రావడం. అనగా పిచ్చిగా ప్రవర్తించడం లాంటి లక్షణాలు ఉన్నచో వెంటనే మెదడుకు సంబంధించిన వైద్య నిపుణల సలహాలు పాటించాలి. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే న్యూరో స్పెషలిస్టును సంప్రదించాలి.

ఇతర క్యాన్సర్ల నుంచీ...

మధ్య వయస్సులో, 60 ఏళ్లు దాటిన వారిలో కొన్ని రకాల క్యాన్సర్లు శరీరంలో వివిధ భాగాల నుండి మెదడుకు రక్తం ద్వారా వ్యాపిస్తాయి. ఉదాహరణకు ఊపిరితిత్తుల క్యాన్సర్, పేగుల క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ మెదడుకు వ్యాపిస్తాయి. మెదడు క్యాన్సర్లను ప్రాణాంతకమైనవిగా భావిస్తారు. మరికొన్ని ప్రాథమిక దశలో గుర్తిస్తే ఆపరేషన్ ద్వారా తగ్గించవచ్చు.

నిర్ధారణ పరీక్షలు-చికిత్సలు

మెదడు క్యాన్సర్ నిర్ధారణకు తల ఎక్సరే, సిటి స్కానింగ్, యం.ఆర్.ఐ. స్కానింగ్, అత్యాధునికమైన ఎం.ఆర్.యస్ స్కానింగ్, పెట్ స్కానింగ్ పరీక్షలు చేస్తారు. 'స్టీరియోటాక్టిక్ బయాప్సి' పరీక్ష ద్వారా మెదడులోని క్యాన్సర్ కణాలను చిన్న పరిమాణంలో బయటకు తీసి ఏ స్టేజిలో ఉందో గుర్తిస్తారు. గ్రేడు-1, గ్రేడు-2 గ్లయోమ ట్యూమర్లను ముందే నిర్ధారిస్తే మెదడు ఆపరేషన్ ద్వారా తొలగించవచ్చు. గ్రేడు-3, గ్రేడు-4 క్యాన్సర్‌కు ఆపరేషన్ కాకుండా కీమో థెరపీ, రేడియోథెరపీ ఇస్తారు. గ్రేడు-4 క్యాన్సర్ చాలా ప్రమాదకరమైంది.

చాలా వరకు క్యాన్సర్లు ప్రాథమిక దశలో గుర్తిస్తే ఆ రోగి జీవిత కాలాన్ని పొడిగించే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి. కొన్ని రకాల మెదడులో గడ్డలు ఆపరేషన్ ద్వారా తొలగిస్తే జీవన ప్రమాణాన్ని పెంచే అవకాశముంది. ❋





కథ

సరదాగా ఓ కల

మూలం : విలియం బట్లర్ ఈట్స్

డ్రీమ్స్ దట్ హేవ్ నో మోరల్

అనువాదం : ముక్తవరం పార్థసారథి

"చలికాలంలో ఈగలు ముసిరినట్టుగా గుమిగూడారు కూలీలక్కడ" అందావిడ. క్షణం విరామం లేక ఎప్పుడూ ఏదో ఒకటి వాగుతూనే ఉంటారట. కావచ్చు కాని ఆ మాటల్లోనే వాళ్లు ఎముకలు కొరికే చలిని మరిచిపోగలరు. కాయకష్టం చేసినా కడుపు నిండని వాళ్లు స్వప్నలోకంలోనే సుఖాలనన్వేషిస్తారు. ఒకడు దేవకన్యతో పేకాట ఆడుతాడు. మరో ముసలాడికి మహిమలుగల నల్లపంది కనిపిస్తుంది. రాఫ్టెరీ, కలానన్‌లలో ఎవరు గొప్ప కవి అని వాదించుకుంటూ గడుపుతారు కొందరు.

"రాఫ్టెరీ గొప్పవాడు. అతని పాటలు తెలియనివాడు భూప్రపంచంలోనే లేడు, కాని కలానన్ పాటల కోసం గడ్డకట్టే చలినైనా భరించగలం.' ఈలోగా కథ చెప్పటం ప్రారంభించాడొకడు.

అందరూ తమతమ కబుర్లాపి ఆసక్తిగా విన్నారు. ఏ కాస్త ఆనందం కలిగినా నవ్వాపుకోలేం. ఆ కథే ఇప్పుడు మీకు చెప్పబోతున్నాను. వీళ్ల కథలో గొప్ప సందేశాలూ, తెలుసుకోవాల్సిన విషయాలూ వుండవు. విన్నంతసేపూ చలిని మరిపించగలిగితే చాలు. కానీ కనీసావసరాలు తీరటం కోసమే వాళ్లు వొళ్లు హూనం చేసుకుంటారు. అలాంటి అమాయకులు చెప్పుకునే కథల్లో ఆలోచించి తెలుసుకోవాల్సిన అంతరార్థమేమీ ఉండదు. మనం కార్యకారణ సంబంధాల్ని గురించి ఆలోచిస్తాం. ఏదైనా జరిగితే పరిణామం ఎలా ఉండబోతోందోనని విశ్లేషిస్తాం. కాని వాళ్ల ప్రకారం అనగనగా ఒక కాలంలో మనుషులందరూ నిర్విచారంగా బతికేవాళ్లు. భవిష్యత్తును గురించిన బెంగలేదు. మనసు మంచిదైతే చచ్చిన వాళ్లను కూడా మంత్రదండంతో బతికించవచ్చు. రాజుకూ, నీకు పోలికలుంటే, అతడి అంతఃపురంలోకి ప్రవేశించి రాణితో క్రీడించవచ్చు. మహా అయితే పొరబాటు జరిగినందుకు అతడు కాస్త చికాకు పడతాడు. బలహీనులందరూ కలల్లోనే తమ స్వర్గం వెదుక్కుంటారు. ఇందుకు మీరూ, నేను కూడా మినహాయింపు కాదు. కలల రెక్కలతో ఎగిరితే బతుకుభారం తెలియదు.

అనగనగా ఓ రాజు. ఆయనకు పుత్రసంతానం లేదు. ఏం చెయ్యాలో పాలుబోక ముఖ్యసలహాదారును సంప్రదించాడు.

"అదెంతపని! నేను చెప్పినట్టు చెయ్యండి. ఒక ప్రత్యేక జలాశయంలో (ఆ జలాశయం పేరు చెవిలో చెప్పాడు) చేపను పట్టి తెమ్మని సేవకుల్ని ఆదేశించండి. రాణీగారు దాన్ని తింటే మీ అభీష్టం నెరవేరుతుంది" అంటూ సమస్యను పరిష్కరించాడు ముఖ్య సలహాదారు.

చేపను తెచ్చారు. రాజు దాన్ని వంటమనిషికిచ్చాడు. ఆమె దాన్ని నిప్పులమీద కాల్చింది. అలా కాల్చినప్పుడు దాని చర్మం బొబ్బలెక్క గూడదు. కాని బొబ్బలెక్క కుండా కాల్చడం అసంభవం. ఒకటి రెండు చోట్ల చర్మం కాస్త పైకి లేవగానే వంటవాడు వేలితో నొక్కి ఆ వేలిని నోటిలో పెట్టుకుని రుచిచూశాడు. రాణి చేపను తిని మిగిలింది, పెరట్లో పడేసింది. అక్కడున్న ఓ ఆడగుర్రం, జాగిలం కిందపడిన ఎముకల్ని తిన్నాయి. ఏడాది తిరక్కుండానే రాణి ఓ పండంటి కొడుకును ప్రసవించింది. వంటావిడ కూడా మరో కొడుక్కూ, గుర్రం, కుక్కా రెండేసి పిల్లలకూ జన్మనిచ్చాయి. కొన్నేళ్ల తర్వాత ఇద్దరు మగపిల్లలూ కవలల్లాగే కనిపించారు. ఎవరు ఎవరో పోల్చుకోవటం కష్టమైంది.

ఈ చిక్కుముడి విప్పమని ముఖ్య సలహాదారును ఆశ్రయించింది రాణి. తన కొడుక్కు అందే సౌఖ్యాలు, సౌకర్యాలు వంటమనిషి సంతానానికి కూడా లభించటానికి ఏరాణీ ఇష్టపడదు.

"అదెంత పని. మీరు ద్వారంలో నిలుచోండి. లోపలికి ప్రవేశించిన ఇద్దరిలో ఎవరు మీకు అభివాదం చేస్తాడో, అతడే మీ పుత్రుడు" అన్నాడు ముఖ్య సలహాదారు.

ఆ సలహా పాటించింది రాణి. తన కొడుకును పోల్చుకోగలింది, సాయంత్రం భోజనాలవేళ టేబుల్ వద్ద కూర్చున్న పని మనిషి కొడుకు జాక్‌తో

"నువ్వు నా సంతానం కాదు. ఇక్కడుండొద్దు" అని చెపింది నిష్కర్షగా.

"వాణ్ణెక్కడికీ పంపొద్దు. మేం సోదరులం కామా?" అంటూ కన్నీటి పర్యంతమయ్యాడు బిల్.

"మీరు నా స్వంత తల్లిదండ్రులు కాదని తెలిస్తే నేనెప్పుడో వెళ్ళిపోయేవాణ్ణి" అన్నాడు జాక్.

బిల్ ఎంత బతిమాలినా వినలేదు. చివరి మాటగా "నాకేదైనా ప్రమాదం జరిగితే, ఈ ఇంటి వెనక బావిలో నీటిపైన నెత్తురూ, లోపల తేనె పేరుకుపోతాయి" అంటూ కీలక రహస్యం ఒకటి చెప్పాడు అతడితో.

ప్రయాణంలో సహాయంగా వుంటాయని, చేపను తినగా పుట్టిన ఒక గుర్రంపిల్లనూ, కుక్కపిల్లను కూడా వెంట తీసుకెళ్లాడు జాక్. అలా వాయువేగంతో ముందుకు కదిలి ఒక రాజుగారింటికి చేరుకుని "మీకు సేవకులు కావాలా?" అంటూ వాకబు చేశాడు.

"ఆ నా పశువులను మేపటానికో కుర్రాడు కావాలి" అన్నాడు రాజు.

ఆ రోజు నుండి, ఇరవైనాలుగు ఆవులను మేతకు తీసికెళ్లాడు జాక్. కాని చుట్టు పక్కలంతా రాళ్లూ, రప్పలే తప్ప గడ్డి లేదు. అల్లంత దూరంలో పచ్చదనం కనిపించింది. కానీ ఆ పొలం ఓ రాక్షసుడిది. చుట్టూవున్న కంచె కాస్త తొలగించి పశువుల్ని అందులో మేతకు పంపాడు. అక్కడే ఉన్న ఒక ఆపిల్ చెట్టెక్కి పళ్లు తింటూ కుర్చున్నాడు.

> **ఆ మాటలు విన్న జాక్‌కు కోపం వచ్చింది. తన ఖడ్గంతో రాజు తల నరికెయ్యాలనుకున్నాడు. కాని రాకుమారిని చూసి మనసు కరిగిపోయింది. బూటు అతని కాలికి సరిగ్గా సరిపోయింది, జుట్టు కలిసింది.**

రాక్షసుడికి నరవాసన తగిలింది.

"ఐరిష్ నెత్తుటి వాసన వేస్తున్నది. ఎక్కడన్నావురా! ఆ చెట్టు పైనుండి దిగు. నువ్వెంత మనిషివి. ఒక్క పంటి కిందికి కూడా రావు. నిన్ను పిండి చేసి నశ్యంగా పీల్చుస్తాను" అంటూ హూంకరించాడు.

"బలవంతులకు దయాగుణం ఉండాలి " అన్నాడు జాక్.

"కిందికి దిగరా నీ అంతు చూస్తాను" అన్నాడు రాక్షసుడు.

జాక్ దిగి వచ్చాడు. ఇద్దరి మధ్యా భయంకరమైన యుద్ధం జరిగింది. గట్టిగా ఉన్నా నేల గుల్లగా మారింది. గుల్లనేల గట్టిపడింది. కత్తులతో గుచ్చిన చోట చెలమల్లోంచి నీరు పొంగింది. క్షణం విరామం లేక రోజంతా పోరాటం సాగింది. పొద్దుగూకుతున్నప్పుడు చెట్టు మీద వాలిన ఒక పక్షి" సూర్యాస్తమయంలోగా నువ్వు వాణ్ణి చంపకపోయావో వాడు నిన్ను

విరుద్ధ పుష్పాలు



సన్ ఫ్లవర్‌కే పొద్దు తిరుగుడు పువ్వు అని పేరు. ఇది రోజంతా సూర్యుడు ఎటు తిరిగితే అటువైపు తన దిశను మార్చుకుంటూ వుంటుంది. అది పొద్దంతా సూర్యుణ్ణి చూస్తూనే వుంటుందా అనిపిస్తుంది. అయితే సూర్యుడంటే గిట్టని పువ్వు ఒకటుంది. బ్లాడర్ కాంపియన్ అనే మొక్కకు పూసే పువ్వులు సూర్యకాంతిని చూస్తే చాలు ముడుచుకుపోతాయి. ఈ రకం పువ్వులు బాగా మేఘావృతమై ఉన్నప్పుడు లేదా బాగా నీడ వచ్చినప్పుడు మాత్రమే విచ్చుకుంటాయి. ఏ మాత్రం ఎండ కనిపించినా ఇవి వెంటనే ముడుచుకుపోతాయి.

తెల్సా!

పోలీసు కుక్కలు నేరస్తుల్నెలా గుర్తిస్తాయి?

ఏదైనా మర్డర్‌కానీ, అతి పెద్ద దొంగతనం కానీ జరిగిన వెంటనే ఆ స్థలంలో పోలీసులు, డిటెక్టివ్‌లు, వేలి ముద్రల నిపుణులు ప్రత్యక్షమవుతారు. కొన్ని సందర్భాల్లో వీరి వెంట కుక్కల్ని తీసుకురావడం చూస్తుంటాము. ఈ పోలీసు కుక్కల్లో నిందితుల జాడలను గుర్తించేవీ, మాదకద్రవ్యాల జాడలను గుర్తించే రకం కుక్కలు సంఘటనా స్థలంలో నిందితుడు అంటుకున్న వస్తువులను వాసన చూసి నిందితుల జాడలను గుర్తిస్తాయి. కొన్నేళ్ల క్రితం నాగ్‌పూర్‌లో ఒక పోలీసు కుక్క హత్య కేసులో నిందితుడిని సంఘటనా స్థలానికి 45 కిలోమీటర్ల దూరంలో గుర్తించింది. మార్గమాధ్యంలో అది పొలాలు, రోడ్లు, దట్టమైన అడవిని అధిగమించి ఒక ఖాళీ ట్యాంకులో దాక్కుని ఉన్న నేరస్తుని పట్టించింది. కొందరు నేరస్తులు తమను కుక్క వెంటాడుతుందని గుర్తించగానే జిగ్‌జాగ్‌గా పరిగెత్తుతూ నీళ్లలో ఈదుకుంటూ అవతల ఒడ్డుకు చేరి తమ జాడలను కుక్కలు గుర్తించలేవని అనుకుంటుంటారు. అయితే కుక్కను మోసపుచ్చడం అంత తేలికైన విషయం కాదు. మన శరీరగంధం మన చుట్టూ ఉన్న వాతావరణంలోకి వెదజల్లబడుతుంది. వీటిని శిక్షణ పొందిన కుక్కలు చాలాతేలికగా గుర్తిస్తాయి. కుక్కల్లో కొన్ని జాతుల కుక్కలు పోలీసు కుక్కలుగా గుర్తింపు పొందాయి. వీటిలో ఆడ కుక్కలు జాడలను మరింత సమర్థవంతంగా గుర్తిస్తాయి. హంటింగ్ డాగ్స్ లేదా హూండ్స్, లాబ్రాడార్ రిట్రీవర్, డాబర్‌మాన్ పించర్, జర్మనీ షార్డ్ (అల్సేషన్) రకం కుక్కలను పోలీసు కుక్కలుగా ఎంపిక చేస్తారు. కుక్కలకు 6నెలల వయస్సు నుండి 10,12 మాసాల వరకూ శిక్షణనిస్తారు.

జంతువులు ప్రమాదాల్ని ముందుగానే పసిగడ్తాయా?



భూకంపాలు, అగ్ని పర్వత పేలుళ్లు, ఇంకా అటువంటి కోవకు చెందిన ప్రమాదాలను జంతువులు ముందుగానే పసిగడ్తాయి. దీనికి ఉదాహరణగా ఒక సంఘటన ప్రముఖంగా చెప్పుకోవచ్చు.

వెస్టిండీస్ దేశం మార్టినిక్ ద్వీపంలోని సెయింట్ పీర్ పట్టణంలో 1902వ సంవత్సరం మే నెలలో ప్రశాంతంగా వున్న ఒక రోజు జంతువులన్నీ రోడ్ల మీదకు పరుగులు పెట్టాయి. ఇళ్లలో నుండి, కొట్టాలలో నుండి ఎలుకలు, పిల్లులు, కుక్కలు, ఆవులు, పాములు ఒకటేమిటి అన్ని రకాల జంతువులూ ఒకదాని వెంట ఒకటి అన్నీ బైటకు వచ్చి సముద్రపు ఒడ్డు వైపుగా పరుగుతీశాయి. ఒడ్డుకు చేరుకునేవరకు ఒక్కటి కూడా మధ్యలో ఆగలేదు. అన్నీ నీటిలో దిగి ఈదడం మొదలు పెట్టాయి. కొన్ని నీటిలో మునిగిపోయాయి. జంతువులు అలా ఎందుకు పరుగుపెట్టాయో పీర్ పట్టణ ప్రజలకు అర్థం కాలేదు. మార్టినిక్ ద్వీపం అగ్ని పర్వతాలతో నిండి ఉంటుంది. పీర్ పట్టణం వాటిలోకెల్లా పెద్దదైన పీలీ పర్వతపాదాల వద్ద వుంది. పీర్ పట్టణ ప్రజలు అనుకోని ఉపద్రవమేదైనా సంభవిస్తుందేమోనని భయపడ్డారు. అయితే మార్టినిక్ ద్వీప శాస్త్రజ్ఞులు అటువంటిదేమీ లేదని ప్రజలు ఉన్మాదులుగా తయారు కావద్దని సూచనలు చేశారు. పరిశోధనాశాలల్లోని భూకంపలేఖినులు భూకంపాల గూర్చి ఎటువంటి చిన్న సూచనలను సైతం చేయడం లేదని వారు నిర్ధారించారు. ఆ తర్వాత మూడు రోజులకు పీలీ పర్వతం బద్దలైంది. ఆ బ్రహ్మాండ విస్ఫోటనం పట్టణంలోని 30వేల మంది ప్రజలను కబళించి వేసింది. అగ్నిపర్వతం నుండి వెలువడిన లావా పట్టణం మొత్తాన్ని చుట్టివేసింది. పట్టణం మీద ఇద్దరే ఇద్దరు అగ్ని పర్వతం సృష్టించిన ప్రళయం నుండి రక్షించబడ్డారు. వారు ఒక చెప్పులు కుట్టే వ్యక్తి, మరో ఖైదీ. పట్టణంలోని జైలు బిల్డింగ్ ఈ విలయంలో చెక్కు చెదరకుండా నిలచి ఉంది. ఈ కారణంగా అందులో ఖైదీ రక్షించబడ్డాడు. ఇకపోతే ఈ ప్రమాదంలో ఒకే ఒక పిల్లి మృతి చెందింది. బహుశా ఇది ఒక ఇంటిలో బంధించబడి వుండటం వల్ల మిగతావాటితో బాటు వెళ్లలేకపోయి వుంటుంది.

మటన్ మసాలా

కావలసినవి

మాంసం - 250 గ్రాములు,
పెరుగు - 1కప్పు
ఉల్లిపాయలు - 4, తాలింపు
గింజలు - కొద్దిగా
లవంగాలు - రెండు, దాల్చిన చెక్క - 10 గ్రాములు
నెయ్యి - 25 గ్రాములు, యాలుకలు - 2
డాల్డా - 50 గ్రాములు, పచ్చిమిర్చి - 4
పలావు ఆకు - కొంచెం, పసుపు - చిటికెడు
ఉప్పు - రుచికి సరిపడా

తయారుచేయు విధానం

మొదట మాంసాన్ని శుభ్రం చేసి ముక్కలు కట్ చేయాలి. తరువాత ఉల్లిపాయల్ని, పచ్చిమిర్చిని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. లవంగాలు, చెక్క పొడి చేసుకుని ఉంచుకోవాలి. తరువాత స్టౌమీద బాండీపెట్టి నెయ్యి వేసి దానిలో మాంసం ముక్కలు వేసి ఉడకనివ్వాలి. దానిలో పెరుగు కూడా కలపాలి. వేరే గిన్నెలో డాల్డావేసి ఉల్లిపాయముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, మసాలాలు కలిపి దోరగా వేయించుకోవాలి. తరువాత ముక్కలు ఉడికి పెరుగు ఇంకిపోయిన తరువాత ఒక కప్పు నీళ్లు పోసి బాగా మగ్గనివ్వాలి. ఆ నీరంతా పూర్తిగా ఇగిరిపోయాక వేయించిన ఉల్లి,పచ్చిమిర్చి ముక్కలను కలపాలి. నీరంతా ఇంకిపోయి నెయ్యి పైకి తేలుతుంది. చివరగా కొత్తిమీర చల్లి సర్వ్ చేయాలి.

మటన్ కోకోనట్ ఫ్రై

కావలసినవి

మటన్ - కిలో,
ఉల్లిపాయలు - 100గ్రాములు
ఎండుమిర్చి - 50 గ్రాములు, పచ్చిమిర్చి - 10
పచ్చికొబ్బరి - రెండు చిప్పలు, మిరియాలు - 25 గ్రాములు
పసుపు - అరస్పూను, ఉప్పు - సరిపడా,
నూనె - 100 గ్రాములు, గరం మసాలా - 25 గ్రాములు, జీలకర్ర - 25 గ్రాములు, అల్లం వెల్లుల్లి పేస్ట్ - 50 గ్రాములు,
కరివేపాకు - రెండు రెబ్బలు

తయారు చేయువిధానం

మాంసాన్ని శుభ్రం చేసి ఉప్పు, పసుపు కలిపి నీళ్లు లేకుండా ఉడకపెట్టాలి. ఒక బాండీలో నూనె పోసి బాగా కాగాక ఉల్లిపాయలు, కరివేపాకు వేసి అందులోనే అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి వేయించాలి. వుడికిన మాంసం ముక్కలను నిలువుగా కోసిన కొబ్బరి ముక్కలను పొడవుగా కోసిన పచ్చిమిర్చి వేసి వేపాలి. ఇది వేగుతుండగా ఎండుమిర్చి, మిరియాలు, గరం మసాలా జీలకర్ర పొడులను జల్లి కాసేపటికే దింపేయొచ్చు.



టమాటా మాంసం

కావలసినవి

మాంసం - ఒక కిలో,
టమాటాలు - ఒక కిలో
ఉల్లిపాయలు - 150 గ్రాములు, కొత్తిమీర - ఒక కట్ట
గరం మసాలా - 5 గ్రాములు, నూనె - 150 గ్రాములు
ఉప్పు - సరిపడా, ఎండు మిర్చి - పది
కారం - రెండు స్పూన్లు, పసుపు - ఒక స్పూను
అల్లం పేస్ట్- అర స్పూను, వెల్లుల్లి పేస్ట్- అరస్పూను

తయారు చేయు విధానం

ముందుగా మాంసం ముక్కలను బాగా ఉడికించండి. తర్వాత కొద్దిగా మసాలా తీసుకుని ఉడికిన ముక్కలకు బాగా పట్టేలా కలపండి. ఒక బాండీలో నూనె పోసి బాగా కాగాక ఉల్లిపాయ ముక్కల్ని వేసి బాగా ఎర్రగా వేగనివ్వండి. తరువాత మసాలా పట్టించిన మాంసం ముక్కల్ని అందులో వేయండి. టమాటాలను చిన్న చిన్న ముక్కలుగా చేసి వాటిలో మిగిలిన మసాలాను కలపాలి. ఈ మసాలా కలిపిన టమాటా ముక్కలను ఒక పాత్రలో పోసి రెండు కప్పులు నీళ్లు పోసి బాగా ఉడికించండి. మటన్ బాగా ఉడికిన తర్వాత ఉడికించిన టమాటా గుజ్జును అందులో కలపండి. దింపే ముందు కొత్తిమీర వేస్తే కూర తయారైనట్టే. వేడివేడి అన్నంలో బాగా రుచిగా ఉంటుంది.

మొక్కజొన్నలు - వేట మాంసం

కావలసినవి

మాంసం - కిలో, మొక్కజొన్న కండెలు - 6, పెరుగు - 2 కప్పులు,
ఉప్పు - సరిపడా, కొత్తిమీర - ఒక కట్ట,నూనె - 100 గ్రాములు
నిమ్మకాయలు - 4, గరం మసాలా- ఒక స్పూను
అల్లం వెల్లుల్లి పేస్ట్ - 2 స్పూన్లు, ధనియాల పొడి - 3స్పూన్ల
పసుపు - చిటికెడు, పచ్చిమిర్చి - 6, పాలు - 4 కప్పులు
కారం - 2స్పూన్లు, జీలకర్ర - 2స్పూన్లు

తయారు చేయు విధానం

మాంసాన్ని శుభ్రం చేసి నీళ్లు బాగా కాగాక పాత్రలో వేయండి. అందులో పెరుగు, కారం, పసుపు, అల్లం వెల్లుల్లి పేస్ట్, ధనియాలపొడి, జీలకర్రపొడి, ఉప్పు వేసి బాగా కలపాలి. మొక్కజొన్న పొత్తులను నీటిలో ఉడికించి గ్రైండర్‌లో వేసి రుబ్బుకోవాలి. ఒక పాత్రలో నూనె పోసి బాగా కాగాక గరం మసాలా వేశాక కొంచెం ఆగి మాంసం మిశ్రమాన్ని అందులో వేసి మూత పెట్టాలి. బాగా ఇగిరిన తరువాత కొంచెం నీళ్లు పోసి పచ్చి మిర్చి వేసి ఉడికించాలి. అందులో పాలు పోసి ముద్దగా తయారుచేసి పెట్టుకున్న మొక్కజొన్న విత్తుల గుజ్జు, నిమ్మరసం వేసి కొంచెం సేపు మరిగాక సరిపడా ఉప్పు వేయాలి. బాగా మగ్గిన తరువాత కొత్తిమీర ముక్కలు వేసి దింపేయాలి. దీన్ని వేడి అన్నంలో వేసుకుంటే చాలా బావుంటుంది.



కథా నిలయం
శ్రీకాకుళం

థియేటర్ అంటే ప్రాణం

"నాకు థియేటర్ అంటే ప్రాణం. అందులోనే అసలైన నటనా ప్రావీణ్యమంతా బయటపడుతుంది. పాత్రలో లీనమయ్యే అవకాశం ఉంటుంది. జ్ఞాపకశక్తికి పదును పెట్టడానికి అక్కడే ఛాన్సుంటుంది. అదొక పెద్ద కుటుంబం. అందులో నేనొక సభ్యుణ్ణి కావడం నాకెంతోఇష్టం"

ఆ పన్నెండేళ్ల పసివాడు నేడు ప్రేక్షకులందరినీ ఉర్రూతలూగిస్తున్నాడు. ప్రశంసల వర్షంలో తడిసి ముద్దవుతున్నాడు. మీడియాకు ఇంటర్వ్యూలిస్తూ బిజీబిజీగా ఉన్నాడు. అనుకోకుండా వచ్చిన అవకాశాలతో ఉబ్బితబ్బిబ్బవుతున్నాడు. వాడే 'స్లమ్ డాగ్ మిలియనీర్'లో కౌమారదశలోనున్న జమాల్‌గా ఇమిడిపోయిన 'తనయ్ చద్దా'!

"స్లమ్ డాగ్ మిలియనీర్‌లో నాకు అనుకోకుండా అవకాశం వచ్చింది. నిజానికి నేను ఆడిషన్‌కు సరైన సమయానికి చేరుకోలేకపోయాను. కానీ అదృష్టం నావెంటే ఉంది" అన్నాడు తనయ్. స్లమ్ డాగ్ మిలియనీర్‌లో జమాల్‌గా తాజ్‌మహల్ దగ్గరి సన్నివేశాలు మనల్ని ఆకర్షించాయి. చిన్ననాటి నెచ్చెలి కోసం అన్వేషించే జమాల్ మన స్మృతి పథం నుండి అప్పుడే తప్పుకోడు. అంత సహజంగా ఆ సినిమాలో జీవించాడు తనయ్.

తనయ్‌కు ఇది తొలి అవకాశం కాదు. ఇంతకుముందే అతను కొన్ని చిత్రాల్లో నటించాడు. అది కూడా అగ్రతారలతో..! 'తారే జమీన్ పర్' చూసినవారికి ఇషాంత్ స్నేహితునిగా నటించిన 'రాజన్ దామోదరన్' గుర్తుండే ఉండాలి. అంగవైకల్యం కలిగి చదువులో ముందుండే రాజన్ అందులో ఇషాంత్‌కు చక్కని స్నేహితుడు. అతనే 'తనయ్'. మళ్లీ షారూక్ ఖాన్ హీరోగా వచ్చిన 'డాన్'లో అర్జున్ రాంపాల్ కొడుకుగా నటించాడు.

తనయ్‌కు నాటకాలంటే పిచ్చి. "నాకు థియేటర్ అంటే ప్రాణం. అందులోనే అసలైన నటనా ప్రావీణ్యమంతా బయటపడుతుంది. పాత్రలో లీనమయ్యే అవకాశం ఉంటుంది. జ్ఞాపకశక్తికి పదును పెట్టడానికి అక్కడే ఛాన్సుంటుంది. అదొక పెద్ద కుటుంబం. అందులో నేనొక సభ్యుణ్ణి కావడం నాకెంతోఇష్టం" అంటాడు తనయ్.

"మీకు తెలుసా? నేను స్లమ్ డాగ్ మిలీనియర్‌లో నటిస్తుండగా నన్ను షూటింగ్ స్పాట్‌కు వాచమెన్ వెళ్లనివ్వలేదు. ఎందుకనంటే నేను చూడటానికి నిజంగానే వీధిబాలుడిలా అనిపించానట" అంటూ నవ్వేశాడు తనయ్. ఆరోజు సమయానికి యూనిట్‌వాళ్లొచ్చి రక్షించారట.

"నేను పెద్దయినా నటనను వదులుకోను. ఇదొక సృజనాత్మకత నిండిన రంగం" అంటాడు ఎంతో పెద్దరికంగా!

ఇన్ని కబుర్లు చెప్పే తనయ్ ఇంతమంది అగ్రనటులతో నటించాడు కదా! నీకే నటుడంటే ఇష్టం అంటే మాత్రం "నాకందరూ ఇష్టమే. అందరిలోనూ గొప్ప టేలెంట్ ఉంది" అంటూ దాటేశాడు. అప్పుడే సినీ రంగపు తెలివితేటలు అబ్బేశాయన్నమాట!

అమీర్‌ఖాన్ గురించి చెపుతూ 'ఆయనకు ఎదుటివారి నుండి పూర్తి అభినయాన్ని రాబట్టుకునే సామర్థ్యం చాలా ఉంది. ప్రతీ వాక్యం తను చెప్పి, నటించి చూపేవాడు" అంటాడు. "షారుక్‌ఖాన్ కూల్‌గా ఉంటాడు. కబుర్ల పోగు. ఆయన నన్నెంతో ప్రభావితం చేశాడు" అని మెచ్చుకున్నాడు.

తనయ్ కథలు కూడా రాస్తుంటాడు. "నేను కథలు విపరీతంగా చదువుతాను. ఫాంటసీ, కామిక్స్ అంటే చాలా ఇష్టం" అనే తనయ్ ఇప్పటికే చాలా పుస్తకాలు చదివేశాడట.

మరి ఇతగాడి హాబీలు "పెయింటింగ్, ఫోటోగ్రఫీ"! కానీ అస్తమానం బొమ్మలేసుకుంటూ కూర్చోవడం మాత్రం తనకు నచ్చదనేశాడు.

తనయ్ నటించిన 'మస్టాంగ్ మామ' త్వరలో రాబోతోంది. కేవలం నటించడమే కాకుండా స్క్రిప్ట్ రాస్తానని, దర్శకత్వం కూడా చేస్తానని చెప్పే తనయ్ తనకు ఇష్టమైన రంగంలో వృద్ధిలోకి రావాలని, మరిన్ని సినిమాల్లో కనిపించాలని కోరుకుందాం!!

వీరి వీరి గుమ్మడి పండు

వీరి పేరేమి?



ఇది ఓ ప్రముఖ రాజకీయ నాయకుడి చిన్నప్పటి ఫోటో.



ఈఫోటోలో ఉన్నది ఓ ప్రముఖ హిందీ హీరో.

వీరెవరో తెలియాలంటే....24వ పేజీ చూడండి.

ఓహ్! షంషాద్ బేగంకు 'పద్మ' అవార్డ్!

కలలో కూడా ఊహించని అదృష్టదేవత హఠాత్తుగా పరుగుపరుగున వచ్చి అందలం ఎక్కిస్తుందట. ఆ దేవత చంచల మనస్కురాలు... అప్పుడప్పుడు మగతగా ఉంటుంది. అప్పుడప్పుడు గుడ్డిగానూ ఉంటుంది. కానీ, స్వీకరించే వాళ్లు మనలాంటి 'జబర్దస్త్ ఫ్యాన్స్' వున్నప్పుడు?

అమృత్ సర్ - పంజాబ్ లో ఒక అనునాసిక స్వరం పుట్టింది. అనాకారిగా ఉంటాను.... అందగత్తెను కాను కదా.. అని అందరి ముందుకు రావడం ఇష్టం ఉండేది కాదామెకు. కెమెరా, ఫోటో సెషన్లకైతే ఆమడదూరం. కానీ, ఆవిడ గొంతు మాయల మరాఠీలా 'బురిడీ' వేసి పోయేది. శ్రోతలను మంత్రముగ్ధులను చేసి కళ్లూ, చెవులూ అప్పగించేలా చేసే గొప్ప స్టైల్ ఉన్న కంఠం. ఆవిడ మన కుందన్ లాల్ సైగల్‌కు ఫ్యాన్. ఫ్యానేం ఖర్మ... కూలర్ లేదా ఎయిర్ కండిషనర్ అని కూడా చెప్పుకోవచ్చు. కుందన్‌లాల్ సైగల్ అంటే ఆ రోజుల్లో చాలా మంది పడి చచ్చేవారు. ఇప్పటికీ సైగల్ దీవానాలు లక్షల్లో ఉన్నారు. సినీ దునియాలోని మేరు పర్వతాలంతటి వాళ్లే సైగల్ గొంతు వినే పిచ్చోళ్లైతే అప్షాల్... మనం ఎంత?

గాన కోకిల లతా మంగేష్కర్ .... మెలోడీ జాదూగర్ మొహమ్మద్ రఫీ సాబ్ ... దర్దీ గీతాల జాదూగర్, ముకేష్.... యాడెలింగ్ చక్రవర్తి, కిషోర్ కుమార్ అందరూ సైగల్ భక్తులే! కానీ, ఈ పాటల భక్తురాలి ముచ్చట వేరే!

- డా॥జె.పి.వైద్య

ఆ రోజుల్లో ఉత్తరాది ప్రాంతంలో శాస్త్రీయ సంగీతం హవా సిటీలోనూ, పట్టణాల్లోనూ, గల్లీల్లోనూ ఉండేది.

ఉస్తాద్ బక్షవాలే సాహెబ్ అలనాటి గొప్ప సారంగీ మాస్టర్ గారు.

'వారెవ్వా!.... బహుత్ ఖూబ్!.... ముక్కుతో పాడినా నీ ముక్కూ గొంతూ బావుంది' అని మెచ్చుకున్నాడు.

ఆవిడ పెషావర్ రేడియో స్టేషన్లో.... ఆ తర్వాత లాహోర్ రేడియో కేంద్రంలో అడపా దడపా సిగ్గులు మొగ్గలేసినా, తల వంచుకుని పాడేది.

ఒక పాటకు దొరికే అపురూపమైన రొక్కం చెప్తే మీరు 'హవ్వ' అంటారు. ఒక పాటకు 'జస్ట్ పంద్రా రూప్యే'.... పదిహేను రూపాయలు మాత్రమే! అయినా, ఆవిడ పాడుతూ పాడుతూ 'ఢిల్లీ రేడియో కేంద్రం' దాకా చేరుకుంది.

పాకీజాలోని ఆద్యంతం అద్భుతమైన పాటలతో మొత్తం దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిన సంగీతకారుడు గులామ్ హైదర్. లాహోర్‌లో ఉండేవాడు. ఖజాంచీ(1941), ఖాందాన్(1942)లో ఒక చాన్స్ ఇచ్చాడు ఆవిడకు....

అప్పటిదాకా 'క్రేన్ ఇంపీరియల్ థియేట్రికల్ కంపెనీ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్'తో కలిసి ఆవిడ రేడియో కే అంకితమై వుండేది. 1944 లో హిందీ సినీ స్వప్న నగరి చేరుకుంది ఆవిడ. లతా మంగేష్కర్, ఆశాబోంస్లే, గీతా దత్, అమీర్ బాయి కర్నాటకే లాంటి హేమాహేమీలు మెల్లమెల్లగా హిందీ సినీ సంగీత ప్రపంచాన్ని తన గుప్పెట్లో బందీ చేస్తున్న తొలిరోజులవి.

చితల్కర్ అంటే మన రామచంద్ర చితల్కర్ లేదా సి. రామచంద్ర ఆవిడతో కలిసి ఒక పాటను శ్రోతల కోసం సిద్ధం చేసి , స్వయంగా పాడి మరీ విజృంభించాడు. అది ఆవిడనూ, సి. రామచంద్రనూ, మనల్నీ చరితార్థులను చేసి పారేసిన గీతం. 'మేరీ జాన్ సండే కే సండే'.

'పతంగా' చిత్రంలో రంగూన్ టెలిఫోన్ పాట యావత్ భారతదేశపు రసిక శ్రోతల్ని అక్షరాలా పిచ్చోళ్లను చేసింది.

'మెరే పియా గయే రంగూన్....

కియా హై వహా సే టెలిఫూన్...

తుమ్హారీ యాద్ సతాతీ హై....'

ఇప్పటికీ ఆ పాట వింటే అలనాటి దర్దీ ఫిల్మీ గీతాల దీవానాలు పాత టెలిఫోన్‌ను ఆత్మీయంగా చూస్తూ గుండెలకు హత్తుకుంటారు.... 'ఛా... నీ యవ్వ... సెల్ ఫోన్‌ల ఏమున్నది' అని కూడా అనుకోవచ్చు... ఆ పాటంటే పిచ్చిక్రేజ్ ఆ రోజుల్లో!

పంజాబ్ రేకా సంగీతం జాదూగర్ 'ఓ.పి.నయ్యర్' ఆవిడను 'టెంపుల్ బెల్ వాయిస్' అనేవాడు. అంటే 'గుళ్లో గంటల గొంతు' అన్నమాట!

లతా మంగేష్కర్, ఆశాభోంస్లే, గీతాదత్‌తో పాటు ఆవిడా తన ప్రత్యేకతను చాటుకుంది.

ప్రభుత్వం ఎప్పటిలాగే ఆలస్యంగా నిద్రలేచింది. కళ్లు నులుముకుంది... 'అరెరే...! పొరపాటు చేశాంరోయ్! షంషాద్ బేగం అంతటి గొప్ప గాయనిని ఇన్నేళ్లుగా గౌరవించలేకపోయాం! ఛ...ఛ.... అనుకుని 'పద్మవిభూషణ్' తో సత్కరించారు 2009లో!

ఈ తతంగాన్నే 'దేర్ ఆయే దురుస్త్ ఆయే' అంటారు. అంటే మన భాషలో - 'హమ్మయ్య! ఆలస్యమైనా సరే... బందనిద్రలోంచి లేచారు కదా మహానుభావులు' అని అంటారులెండి.

1940-60 ప్రాంతంలో దేశంలోని సహృదయ రసికులకు సంగీత గీతాల పుష్పాభిషేకం చేసిన గాయనికి ఇన్నాళ్లకు 'పద్మ' గుర్తింపు! ఠీక్ హై! జానేదో! మనలాంటివాళ్లకు 'పద్మా'లతో - 'కలువ'లతో ఏం పని?

షంషాద్ బేగం అనునాసిక పాటలను తలచుకుందాం- అది చాలు మనకు! అవిడక్కూడా!

• లేకే పహలా పహలా ప్యార్, • బూఝో మెరాక్యా నామ్ రే, • కహీ పే నిగాహే (సి.ఐ.డి/ 56), • కభీ ఆర్ కభీ పార్ (ఆర్ పార్), • మేరి నీందో మే తుమ్ (నయా ఆవాజ్), • ఓ గాడీవాలే, • హోలీ ఆయీరే (మదర్ ఇండియా), • ఛోడ్ బాబుల్ కా ఘర్ (బాబుల్), • మెరీ నీందో మే తుమ్ (నయా అందాజ్), • మేరే పియా గయే రంగూన్ (పతంగా), • కజ్రా మొహబ్బత్ వాలా (కిస్మత్), • మిల్‌తేహి ఆంఖే దిల్ హువా దీవానా కిసీకా.

ఇలాంటి వజ్రాల తునకలిచ్చిన 'షంషాద్ హఠాత్తుగా సినీ సంగీత ప్రపంచం నుండి తప్పుకున్నది. గణపత్‌లాల్ బట్టోను పెళ్లి చేసుకున్నదనీ, ఆయన 1955లో స్వర్గస్తుడయ్యాడనీ ఒక్కగానొక్క కుమార్తె 'ఉషా' తో ఆవిడ 'ముంబాయి' మహానగరంలో ఉందనీ ఎవ్వర్నీ కలవదనీ రకరకాలుగా కథలు వినిపించాయి. రాజకీయాల గాలి అలాంటిది. ఎక్కడ దొచ్చుకుని పోయినా తన హవా చూపుతుంది.

ఏది ఏమైనా 'పద్మ' అవార్డ్‌తో మళ్లీ టెలిఫోన్ అమ్మాయి, ముక్కు పాట మళ్లీ ఖంగుమంది...

మనం లేమా ఏమి 'దిగ్గున లేచి కూర్చోదానికి'!

వుయ్ ఆర్ ఆల్వేస్ గుడ్ ఫ్యాన్స్!

క్రైమ్ కథ

ఒక్కసారి...

- యర్నాగుల సుధాకరరావు

“రేణుక ఒకసారి ఎవరితోనైనా మాట్లాడితే ఆమెకు ఆగొంతు గుర్తుండిపోతుంది.ఆమెకున్న జ్ఞాపకశక్తి మెచ్చదగ్గదేసార్!” స్టిఫ్‌గా నిలబడి చెప్పాడు ఇన్‌స్పెక్టర్ జోసఫ్.

“మహిళా కానిస్టేబుల్ రేణుక గురించి నీవు గొప్పగా చెబుతున్నావు. ఏదైనా ఫైలు తీసుకురమ్మంటే మొత్తం ఫైళ్లు వెతికితేగాని తీసుకురాదు.ఆమె జ్ఞాపకశక్తి ఇప్పుడు ఈకేసులో ఏం పనిచేస్తుంది? నువ్వు ఎందుకు ఆమె గురించి అంతగా చెబుతున్నావో తెలియదు. జరిగిన హత్య పెద్దింటి అమ్మాయి రజనిది. ఇప్పటికే పోలీసు పెద్దతలకాయలు ఫోన్లమీద ఫోన్లు కొడుతున్నారు. మరోవైపు మీడియా చేతకాని పోలీసులు అని దుయ్యబడుతుంటే ముందు హంతకుడు ఎవరైంది కనిపెట్టి పట్టుకోవడం మానుకుని రేణుక జ్ఞాపకశక్తి గురించి నువ్వు నెమరువేయడం నాకు అయోమయంగాఉంది” పైఅధికారి ఒకింత చిరాకు కనబరిచాడు.

“సార్! ఆమె హంతకుడు తనకు తెలుసని కొన్ని ఫైళ్లు ముందేసుకుని కూర్చుంది.ఎందుకంటే రజని ఇంట్లోనే హత్య జరిగింది. ఆమెను హంతకుడు చంపుతున్నప్పుడు లాండ్‌ఫోన్‌లో రక్షించమని అర్థించింది. ఆవెంటనే ఆమె చేతిలో ఫోన్ లాక్కుని “నేనే చంపుతున్నాను.ఎలా రక్షిస్తావో రక్షించు” అని అరిచాడు హంతకుడు. ఈరెండు గొంతులు విన్నది మన మహిళా కానిస్టేబుల్ రేణుకే సార్!”

సార్ వాస్తవానికి నున్న రజని ప్రేమించింది. ఏదో ఒకసారి నిన్ను చంపేస్తాను అని సరదాగా అన్నాను.

“వ్వాట్ రజిని చేతిలో ఫోన్ లాక్కుని నేనే చంపుతున్నాను. ఎలా రక్షిస్తావో రక్షించు అనే రెండు పొల్లు మాటలకే హంతకుడు ఎవరనేది ఈ కానిస్టేబుల్ గుర్తుపట్టేస్తుందా? నీకేమైనా పిచ్చా లేక కాలయాపనలో కేసును తీసుకుపోవాలనుకుంటున్నావా? ముందు హంతకుడు ఎవరో సాయంత్రానికి నాముందుపెట్టాలి. లేకుంటే ఒప్పుకోను. ఏయ్ రేణుకా ఇలారా! నువ్వు ఠాణాలో ఆడింది ఆట పాడింది పాట. ఇలాంటి పనికిమాలిన ఇన్‌స్పెక్టర్ల వద్ద చూపించు నావద్ద కాదు. అంత తెలివైన దానివైతే మాలా పెద్ద ఆఫీసర్ అయ్యేదానివి. నీకంటూ పనులుంటాయి. అవి చేసి తగలడు” కసిరి పొమ్మన్నాడు.

ఆగదిలోంచి రేణుక జోసఫ్‌లు బయటికి వెళ్లిపోయారు.“రేణుకా ఒక్కో అధికారి ఒక్కోలా ఉంటాడు. అవేమి పట్టించుకోవద్దు.ఆయన ఇప్పుడే మరో ఠాణాకు వెళ్లిపోతాడు. అప్పుడు నువ్వు పాతరికార్డులలో క్రిమినల్సు వివరాలు తీయ్. నీవు ‘గొంతు గుర్తుపట్టాను, మనిషిని చూస్తే ఫలానా అనిచెప్పగలను’ అని చెప్పావు. నీమీద నాకు నమ్మకం ఉంది. ఆపనిలో వుండు. నేను సిటీ అంతా గాలిస్తాను” చెప్పి వాన్ ఎక్కాడు.

జోసఫ్ రెండోసారి రజని ఇంటికి వెళ్లాడు. మళ్లీ అడిగిన ప్రశ్నలే అడిగాడు. అక్కడికి రజని స్నేహితురాళ్లు వచ్చారు. వారినీ అడిగాడు. వారు ఒక క్లూ అందించారు. రజనికి శ్రీకర్ అనే బోయ్‌ఫ్రెండు ఉండేవాడు. అతడితో ఏదో గొడవపడి చంపుతాను అనే బెదరింపుకూడా పొందింది. ఆ భయం ఆమెను చాలాకాలం వెంటాడింది.”

“శ్రీకర్ ఎక్కడుంటాడు?అతడికి రజనితో ఎలాంటి స్నేహం ఉండేది. రజనిని చంపుతానన్నంతవరకు ఎందుకువెళ్లాడు” ప్రశ్నలు కురిపించాడు.

“రజని నడిపే కాన్వెంటులో శ్రీకర్ పనిచేసేవాడు.అతడు నిత్యం ఏదో పరీక్షలు రాస్తూనే ఉండేవాడు. రైల్వేలో జాబ్ తగిలింది వెళ్లిపోయాడు. అయితే ఈవారం ఇక్కడికి వచ్చాడు” అని ఒకామె చెబుతుండగా అక్కడికే శ్రీకర్ వచ్చాడు. రజని తల్లితండ్రులకు తన విచారాన్ని వ్యక్తంచేస్తుండగా జోసఫ్ అతడి భుజం మీద చెయ్యివేసి “నీవు శ్రీకర్‌వే కదూ! లోగడ రజనిని చంపుతానని బెదరించావట.అంతటితో వదిలేయకుండా పొడిచేశావు. ఏం తెలియనట్టు వచ్చి పరామర్శిస్తున్నావు” తూటాల్లా మాటలు సంధించాడు.

శ్రీకర్ అదోలా అయిపోయాడు. “ఏమంటున్నారు నేను రజనిని చంపుతానని బెదరించడమేమిటి? అలాంటి పరిస్థితి మామధ్య ఎప్పుడూలేదు.” అంతకు మించి మాట్లాడనీయకుండా వాన్ ఎక్కించుకుని ఠాణాకు తీసుకుపోయాడు. అక్కడే ఉన్న రజని స్నేహితురాళ్లు ఈశ్రీకర్ కన్పించే మెత్తటి మనిషి కాదు. రజనిని ప్రేమ పేరుతో చాలా ఇబ్బంది పెట్టాడు. అక్కడ గుమిగూడినవారికి చెప్పారు. అప్పుడే అక్కడ వారంతా ఇలాంటివారిని జనాల మధ్య తిరుగనీయకూడదు. అందరూ కరుకుమాటలతో శ్రీకర్ వాన్‌చుట్టూ చేరి కోపాన్ని ప్రదర్శించారు.

మూడురోజులుగా శ్రీకర్‌ను ఇంటరాగేషన్‌తో నిజాన్ని రాబట్టే ప్రయత్నం పోలీసులు చేసారు.తనను చావగొట్టి చెవులుమూసినా ఈ నిజాన్ని మాత్రం చెప్పగలను. తప్పితే రజనిని హత్య చేశానని అబద్ధం చెప్పలేను.నాకు రక్తం చూస్తే కళ్లు తిరుగుతాయి.ఇక ఆమెను ప్రేమించే అర్హతలేనివాడిని, ఆమెవద్ద పని చేసేవాడిని అని పదేపదేచెప్పాడు. చీకటిరూమ్‌లో పడేశారు.

జోసఫ్ ఇంటరాగేషన్ చేసిచేసి విసిగిపోయి కుర్చీలో కూలబడి ఆలోచనలో పడ్డాడు. శ్రీకర్ జగమొండిలా ఉన్నాడు. ఎంతతన్నినా దెబ్బలు తింటున్నాడు. విలవిలలాడిపోతున్నాడు. ఒప్పేసుకుంటే కోర్టులో పెట్టేసేవాళ్లం. ఒకపని అయిపోయుండేది. వెధవలు పనిచేయడానికి చేరి యజమానిని లవ్వులో దించడానికి చూడడం కాదంటే చంపుతానని బెదరించడం అదను చూసి చంపేయడం. ఇదో ప్యాషన్‌లా ఉంది ఈకుర్రకారుకు.” అనుకుని టీ చప్పరించసాగాడు.

కానిస్టేబుల్ రేణుక వచ్చి “సార్ దొరికాడు” అని ఆనందంతో అరిచిచెప్పింది. ఒకఫోటో చేతికి అందించింది.

జోసఫ్ ఆఫోటో చూసి “వీడా కేటుగాడు మస్తానా?వీడికి చంపే సీనులేదు.నీవు పొరపడ్డావు. రజనిని చంపినవాడు ఆశ్రీకర్‌గాడే. వాడితోనే ఈరాత్రి నిజం కక్కిస్తాను” పిడికిలి బిగించాడు.

సబ్‌ఇన్‌స్పెక్టర్ లోపలికి వచ్చి “సార్, మస్తానే హంతకుడు అని రేణుక చెప్పడంతో వెంటనే వెతికి పట్టుకుని తెచ్చాను. వాడివద్ద కొన్ని బంగారు ఆభరణాలు, ఒక డైమండ్‌రింగ్ దొరికింది.వాడిని ఎక్కడ దోచావంటే రజని ఇంట్లో అని చెప్పాడు వాడితో రజని పెనుగులాడినందున పొడిచేశాడంట.” వివరించాడు. ఆమాటలకు జోసఫ్ అయోమయంగా చూశాడు.

మస్తాన్‌ను అప్పటికే ఇంటరాగేట్ చేసినందున అతడు జోసఫ్‌ను చూడగానే “నన్నేమి అనవద్దు. నిజం ఒప్పుకుంటున్నాను. నేనే రజనిని చంపేశాను. ఆమె బంగారం షాపులో లక్ష రూపాయిలు విలువచేసే డైమండ్ రింగ్ కొనడం చూశాను. నేను ఎలాగైనా కొట్టేయాలని అర్థరాత్రివేళ ఇంట్లో దిగాను. రజనికి కత్తిచూపినా బెదరకుండా నాతో పెనుగులాడింది.అరవడానికి ప్రయత్నించింది.మద్యం మత్తులో ఏమిచేస్తున్నా నాకు కరెక్టు అనిపించి పొడిచేశాను. నన్ను తోసేసి ల్యాండుఫోన్‌లో నన్ను రక్షించండి అని అరవసాగింది. నేను ఆమె చేతిలో ఫోన్ లాక్కుని నేనే చంపుతున్నాను. ఎలా రక్షిస్తావో రక్షించు అని అరిచిచెప్పి డిస్‌కనెక్టుచేశాను.తీరా పోలీసులతో ఆమె మాట్లాడింది అని నాకు తెలియదు. ఈకానిస్టేబుల్ రేణుకకు ఎప్పుడో ఒకసారి విన్న నాగొంతు గుర్తుకురావడం చాలా ఆశ్చర్యమనిపించింది.”చెప్పి ముగించాడు.

శ్రీకర్‌ను చీకటిగదిలోంచి వెలికి తీశారు. అప్పటికి అతడు ఒక నిజాన్ని చెప్పాడు. “సార్ వాస్తవానికి నున్న రజని ప్రేమించింది. ఏదో ఒకసారి నిన్ను చంపేస్తాను అని సరదాగా అన్నాను. ఆమె చాలా సున్నిత మనస్కురాలు. నాతో నెలరోజులు మాటలు మానుకుంది. ఇంతకుమించి మామధ్య చంపుకునే గొడవలు లేవు సార్” అని నీర్సంగా చెప్పాడు.

జోసఫ్ అతడిని అదోలా చూసి చేయి రోడ్డువైపుకు చూపించి “ఇక నువ్వు వెళ్లొచ్చు. కలలో కూడా ఎవరినీ చంపుతాను, పొడుస్తాను అని హెచ్చరికలు చేయకు. ఇలానే చావు దెబ్బలు తింటావు.”

రేణుకలో ఉన్నది మానసికమైన మెరుపు. అలాంటిది వేలల్లో ఒకరికి ఉంటుంది అని సైకియాట్రిస్టు చెప్పగా ఇన్‌స్పెక్టర్ జోసఫ్ ఆశ్చర్యపోయాడు.

జనపథం

(ఒగ్గుకథలు, పల్లెసుద్దులు, యక్షగానాలు)

ప్రజానాట్యమండలి గురించి తెలియనిదెవరికనీ? సామాజిక వ్యవస్థలో మానవ సంబంధాలు తమ భావాలను రకరకాలుగా బహిర్గతం చేస్తాయి. వాటిని జానపద కళారూపాలు అంటారు. ప్రజా ఉద్యమాల పట్ల నిబద్ధత ఉన్న చోట ఒగ్గుకథలు, పల్లె సుద్దులు, యక్షగానాలు ఒకప్పుడు పల్లె జీవితాలతో విడదీయలేని బంధంగా పెనవేసుకొని పోయాయి.

ఆధునికత పేర్న సంస్కృతి వెర్రివేషాలేస్తున్న ఈ తరుణంలో కూడా అడపా దడపా సాంస్కృతిక ఉద్యమాల ఊపులో జానపద కళారూపాలు ఇంకా తమ ఉనికిని విస్పష్టంగా చాటి చెప్తున్నాయి.

యక్షగానం ఆంధ్రప్రాంతంలోని భూస్వాముల జులుంలోంచి పుట్టుకొచ్చి పేదవాడూ-పెట్టు బడిదారి విధానం పోకడలను మామూలు మనిషి గుండెగోషలా నిలిచిపోయింది. ఒగ్గుకథలూ పల్లె సుద్దులూ ఇంకా గ్రామీణ ప్రాంతంలోని 'విప్లవాత్మకత' ను తేట తెల్లం చేస్తున్న అరుణ కాంతులు. సత్తెన్న జానపద కళారీతులతో తన జీవితాన్ని పెనవేసుకున్న సృజనాత్మక తపస్వి.

ప్రజా ఉద్యమాల పట్ల నిబద్ధత కలిగిన సాంస్కృతికోద్యమ కార్యకర్త.

'రక్తాసుర రెడ్డిన్ భూ బకాసూరుని వంశమున బుట్టిన'... అనే యక్షగానమైనా... 'కరెంటు బిల్లోడు కారు మీదొచ్చె కన్నెర్ర చేసే' అనే దండోరా పాట అయినా... 'సల్లకొచ్చి ముంత దాచే' బాపతు లంచాల ముచ్చట్లు చేప్పే పల్లెసుద్దులైనా.. చదవడానికంటే వినడానికీ, చూసి ఆనందించి, ఆలోచించడానికి ఇంకా బావుంటాయి కాబోలు!

- జె.పి.వైద్య

జనపథం (ఒగ్గుకథలు, పల్లెసుద్దులు, యక్షగానాలు)

రచన : బండి సత్తెన్న

వెల :రూ. 40/-, పేజీలు : 174

ప్రతులకు : ప్రజాశక్తి -అన్ని ప్రముఖ శాఖలు.

కొత్త పుస్తకాలు

కోడలు పిల్ల

(నవల)



సమాజంలో ప్రతి రంగంలోని మనుషుల్లో, మనసుల్లో అంతో ఇంతో సృజనాత్మకత ఉంటుంది. అది కలంతో కావచ్చు... కుంచెతో కావచ్చు.. గళంతో కావచ్చు.. మరింకేదైనా కావచ్చు.

కలంచేత పట్టుకున్న గుండె రాయడం మొదలెడితే-కొన్నాళ్ళకు అది ఒక వ్యసనంలా మారుతుంది. జడ్జిగారి ఆరుగురు ఆడ సంతానంలో మూడో అమ్మాయి 'స్వర్ణ' గారు గృహిణిగా బాధ్యతులు సాగుతున్నా మనస్సులో కలం మీద మక్కువ తగ్గలేదు. రాజకీయాల్లో తలమునకలైనా రాతలు ఆత్మ సంతృప్తినిచ్చాయి.

అనుభవం, ఆత్మావలోకనం విశ్లేషణా తత్వం, భావాలను చక్కటి దొంతరల్లో చదివించేలా రాయగలగడం రచన ప్రత్యేకత.

పల్లెటూరిలో లహరి' అనే కోడలు పిల్ల ఇతివృత్తం ఈ నవల గుండెగోస. మామూలుగా కాకుండా అత్తగారు కాస్తంత ప్రత్యేకంగా చిత్రీకరించబడ్డారు. లహరి సామాన్య స్త్రీ.. భర్తే సర్వస్వం అని భావించే యువతి..

భర్త శ్రీనాథ్ రంగీలా రతన్... అందరిలాగే లహరిలోని దెబ్బతిన్న బెబ్బులి పౌరుషంగా బుసకొడుతుంది... ఇంతవరకు నవలలో సాగేదంతా ఒక మోస్తరు సగటు కథే...

మగవాడు అహంతో మితిమీరి ప్రవర్తిస్తే.. నీవే నా సర్వస్వం సుమా...అని కాళ్ళావేళ్ళా పడ్తూ సమర్పణ.. పునఃసమర్పణ చేయాలా? ఎదిరించి స్వయం ప్రతిభతో నిలబడాలా? సదరు భర్తగారు పశ్చాత్తాపం ప్రదర్శిస్తే జానేదో.. మాఫ్..కరో.. అంటూ సినిమా బాపతు క్లైమాక్స్‌ను జీర్ణం చేసుకోవాలా?

పాఠకులు మాములైన వారు కారు. విజ్ఞులే... సినిమాటిక్ క్లైమాక్స్ ఒక పట్టాన జీర్ణం కాకపోవచ్చు... ఆలోచించేలా చేస్తుంది. గొప్ప ట్విస్ట్‌లూ, అనూహ్యామైన మలుపులూ, నిజజీవితం ఆదర్శాలూ.. కొన్ని ప్రశ్నల్లా నిలుస్తాయి. మట్టిలోంచి వచ్చిన స్వర్ణ రేఖలు మెరుపులున్న గొప్ప నవలా? కాదా? అనే మీమాంసలో పడకుండా చదవండి... ఆ తర్వాత ఆలోచించండి..!

- జె.పి.వైద్య

కోడలు పిల్ల (నవల)

రచయిత్రి: స్వర్ణ సుధాకర్

వెల : రూ. 50 /-, పేజీలు : 134,

ప్రతులకు : విశాలాంధ్ర/ ప్రజాశక్తి/నవోదయ/దిశ/సహచార/తెలుగు పుస్తక కేంద్రం.



బి.ఎస్. రాములు
సామాజిక న్యాయం
అంటే ఏమిటి?
పేజీలు: 208,
వెల: 90/-,
ప్రతులకు :
రాష్ట్రంలోని అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు



బి.ఎస్. రాములు
బీసీలు సాధికారికత
పూలే అంబేడ్కర్ లోహియా
పేజీలు: 144,
వెల: 70/-,
ప్రతులకు :
రాష్ట్రంలోని అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు



విరిబిరి గుమ్మడిపండు జవాబులు : రాజకీయ నాయకుడు పుతిన్, హిందీ హీరో అమీర్ ఖాన్.

చిన్నపాప

పాప...ఎంత చిన్నగా వుందో! ఈ చిన్నారి పేరు కెనడీ. ఇంతకీ తన వయసెంతో తెలిస్తే ఆశ్చర్యపోతారు. పాపకు ఆరేళ్లు. ఇప్పుడు ఇంకా నయం! పుట్టినప్పుడైతే చాలా చాలా తక్కువ బరువుంది. అసలు డాక్టర్లైతే ఒక్కరోజుకంటే బ్రతకదని తేల్చి చెప్పేశారు. అయితే వైద్యుల మాటను తలకిందులు చేస్తూ...నిక్షేపంగా వుంది. కానీ పాప చాలా తక్కువ బరువుతో...చిన్నగా వుండడంతో తల్లిదండ్రులు ఆమెను వైద్యులకు చూపించారు. ఎనిమిది నెలల పాపగా వున్నప్పుడనుకుంటా డాక్టర్లు అన్ని పరీక్షలు చేసి తనకు ఒక ప్రత్యేకమైన సమస్య వుందనీ...అది ప్రపంచంలో కేవలం వంది మందికి మాత్రమే వచ్చే అవకాశం వుందని సెలవిచ్చారు. అంతేకాకుండా ఆ చిన్నారి బరువు, పొడవు నామమాత్రంగానే వుంటాయన్నారు. అయితే అలా జీవించి వుండాలన్నా కూడా తనను చాలా చాలా ప్రత్యేకంగా చూసుకోవాలంట. బాగా ఖర్చుతో కూడుకున్న పని కదా!

కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీకూడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకొని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫోటోను అతికించి పోస్ట్ చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలు చెప్పండి.

వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్

కలంస్నేహం, బాలనేస్తాలు, మోటూరు హనుమంతరావు భవన్, 21/1,
అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్.

పేరు: వి.దయాకర్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: విజ్ఞాన భారతి విద్యాలయం
లక్ష్యం: ఆర్మీ ఆఫీసర్ కావడం
హాబీలు: చదవడం
చిరునామా: వి.దయాకర్
సన్నాఫ్ : వి. రాములు
మిరుదొడ్డి (గామం),
మెదక్.

పేరు: పబ్బతి సంధ్య
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: విజ్ఞాన భారతి విద్యాలయం
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు: పుస్తకాలు చదవటం
చిరునామా: పబ్బతి సంధ్య
డాటరాఫ్ : పి. భూపతి రెడ్డి
లక్ష్మీనగర్ (గ్రా), మిరుదొడ్డి (మం),
మెదక్.

పేరు: పి.నీలిమ
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: విజ్ఞాన భారతి విద్యాలయం
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు: పుస్తకాలు చదవటం
చిరునామా: పి.నీలిమ
డాటరాఫ్ :కనకారెడ్డి
లక్ష్మీనగర్ , మిరుదొడ్డి,
మెదక్.

పేరు: ఎ. రవితేజ
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: విజ్ఞాన భారతి విద్యాలయం
లక్ష్యం: ఇంజనీర్ కావటం
హాబీలు: క్రికెట్ ఆడడం
చిరునామా: ఎ. రవితేజ
సన్నాఫ్ : ఎ.మోహన్
లక్ష్మీనగర్ (గ్రా), మిరుదొడ్డి (మం),
మెదక్.

పేరు: ఎ. హరీష్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: విజ్ఞాన భారతి విద్యాలయం
లక్ష్యం : క్రికెటర్ కావడం
హాబీలు: చదవటం, ఆటలు ఆడటం
చిరునామా: ఎ. హరీష్
సన్నాఫ్ : శంకరయ్య
చెప్యాల(గ్రా),
రామాయంపేట్ (మండలం), మెదక్.

పేరు: కోల ప్రతిభ
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: విజ్ఞాన భారతి విద్యాలయం
లక్ష్యం: డాన్సర్ కావడం
హాబీలు: పుస్తకాలు చదవడం
చిరునామా: కోల ప్రతిభ
డాటరాఫ్ : అంజయ్య
మిరుదొడ్డి (గ్రామం),
మిరుదొడ్డి (మ), మెదక్.

పేరు: కొస నవిత
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: విజ్ఞాన భారతి విద్యాలయం,
లక్ష్యం : ఇంజనీర్ కావడం
హాబీలు: చదవటం
చిరునామా: కొస నవిత
డాటరాఫ్ : కిష్టయ్య
మిరుదొడ్డి (మ), మెదక్.

పేరు: ఎస్. మధుసూదన్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: విజ్ఞాన భారతి విద్యాలయం
లక్ష్యం : పోలీస్ ఆఫీసర్ కావడం
హాబీలు: బొమ్మలు గీయటం, చదవటం
చిరునామా: ఎస్. మధుసూదన్
సన్నాఫ్ : ఎస్. మల్లారెడ్డి
మోతె(గ్రా),
మిరుదొడ్డి (మండలం), మెదక్.